# సింగరేణి కార్మికులకు దీపావళి బోనస్

హైదరాబాద్,దీపావళి కానుకగా సింగరేణి కార్మికులకు బోనస్‌ను శుక్రవారమే చెల్లిస్తున్నామని తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సచివాలయంలో ప్రకటించారు. దీని కోసం సింగరేణి సంస్థ రూ.358 కోట్లను విడుదల చేయాలని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్‌ను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో సింగరేణిపై జరిగిన సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి ఆదేశాలు జారీ చేశారు. గత ఏడాది చెల్లించిన దీపావళి బోనస్ కన్నా ఇది రూ.50 కోట్లు అధికం కావడం విశేషం. శుక్రవారం మధ్యాహ్నం సమయానికి దీపావళి బోనస్‌ను కార్మికుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. దీపావళి బోనస్ కింద ఒక్కొక్క కార్మికుడు రూ.93,750లు అందుకోనున్నారు. సంస్థలో పనిచేస్తున్న దాదాపు 40,000 మంది కార్మికులకు ఈ బోనస్ అందనుంది. బొగ్గు పరిశ్రమ కోసం జేబీసీసీఐ విధానాల్లో భాగంగా కంపెనీలు సాధించిన ఉత్పత్తి పరిమాణం ఆధారంగా కార్మికుల శ్రమకు ప్రోత్సాహకంగా ఈ బోనస్‌ను చెల్లించే పద్ధతి


# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :212 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శనివారం 26-10-2024 | పేజీలు:4 వెల: 2.00


## కేటీఆర్ పరువు నష్టం కేసులో మంత్రి సురేఖకు షాక్..

హైదరాబాద్, అక్టోబర్ 25: కొండా సురేఖ తనపై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేశారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలు చేసిన రూ. 100 కోట్ల పరువు నష్టం కేసులో కోర్టు మంత్రి కొండా సురేఖకు మొట్టికాయలు వేసింది. ఆమె చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నాయంటూ మండిపడింది. ఓ బాధ్యత గల మహిళ మంత్రి ఇలాంటి కామెంట్స్ చేయటం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందని పేర్కొంది. కేటీఆర్ పై కొండా సురేఖ వ్యాఖ్యలను హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు సీరియస్‌గా పరిగణించింది. భవిష్యత్ లో ఇంకెప్పుడూ ఇలాంటి అడ్డగోలు వ్యాఖ్యలను కేటీఆర్ పై చేయవద్దని కొండాను సురేఖను ఆదేశించింది. అత్యంత జుగుప్సాకరంగా ఉన్న ఆ వ్యాఖ్యలను మీడియా, సోషల్ మీడియా, వెబ్ సైట్లు, అన్ని సోషల్ మీడియా ఫ్లాట్ ఫామ్స్ నుంచి తొలగించాలని ఆదేశాలు జారీ చేసింది. యూట్యూబ్, ఫేస్ బుక్, గూగుల్ సంస్థలకు కూడా ఈ వ్యాఖ్యలు ఉన్న వీడియోలను తొలగించాలని ఆదేశాలు జారీ చేసింది. కొండా సురేఖ వ్యాఖ్యలను ప్రసారం చేసిన, కథనాలు ప్రచురించిన మీడియా సంస్థలకు కూడా కోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఈ కామెంట్లకు సంబంధించిన అన్ని కథనాలను సోషల్ మీడియా నుంచి తొలగించాలని ఆయా సంస్థలను కోరింది. కొండా సురేఖ వ్యాఖ్యలు సమాజంలో చెడు ప్రభావాన్ని చూపుతాయని ఆమె వ్యాఖ్యలకు సంబంధించిన అన్ని కథనాలు, వీడియోలు పబ్లిక్ డొమైన్ లో ఉండవద్దని కోర్టు తెలిపింది.



దేశంలో ఇదే మొదటి సారి..

పరువు నష్టం కేసుకు సంబంధించిన ఓ కేసులో మంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తిపై కోర్టు ఇంత ఆగ్రహం వ్యక్తం చేయటం ఇదే తొలిసారని బీఆర్ఎస్ శ్రేణులు పేర్కొంటున్నారు. గతంలోనూ కొండా సురేఖ ఇలాంటి వ్యాఖ్యలు చేశారని.. ఎన్నికల సంఘం ఈ వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించిందన్నారు. ఆయనప్పటికీ మంత్రి కొండా సురేఖలో ఎలాంటి మార్పు రాలేదని విమర్శిస్తున్నారు. తన వ్యక్తిత్వ హననం చేసే విధంగా చేసే ఏ ఆరోపణలను సహించేది లేదని ఇప్పటికే కేటీఆర్ స్పష్టం చేశారు. ఇకపై తన గురించి ఇలాంటి వ్యాఖ్యలు చేసే వారికి ఆయన ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు. కేసులో కోర్టు తాజా కామెంట్లతో కేటీఆర్ కు బలం చేకూరినట్లైంది.

## కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా బీజేపీ ఆందోళన

హైదరాబాద్: హైడ్రా మూసీ పునరుజ్జీవనం పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా తెలంగాణ బీజేపీ శుక్రవారం ఇందిరా పార్క్ వద్ద ఆందోళనకు పిలుపిచ్చింది. మూసీ పరివాహక ప్రాంతాల్లోని పది అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎంపీలు , ఎమ్మెల్యేలు సందర్శిస్తారు. బాధితులతో ముఖా ముఖి కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇవాళ ఉదయం 11గంటలకు ధర్నా చౌక్ వేదికగా బాధితులతో కలిసి మహా ధర్నా నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, పార్లమెంట్ సభ్యులు, శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొంటారు.

కాగా హైదరాబాద్ నగరంలోని మూసీ నది పరివాహక ప్రాంతాల్లో ఇళ్ల కూల్చివేతలపై బాధితులతో కలిసి మహా ధర్నాకు బీజేపీ ప్లాన్ చేసింది. శుక్రవారం ఇందిరా పార్క్, ధర్నా చౌక్ వద్ద కేంద్ర మంత్రి, బీజేపీ స్టేట్ చీఫ్ కిషన్ రెడ్డి అధ్యక్షతన బాధితులతో మహాధర్నా నిర్వహిస్తారు. ఈ నెల 23 , 24 తేదీల్లో బీజేపీ నేతలు వరుసగా కార్యక్రమాలు నిర్వహించారు. మూసీ బాధిత పరివాహక ప్రాంతాల్లో పర్యటించారు. బీజేపీ నేతలు 9 బృందాలుగా ఏర్పడి పర్యటించారు. బాధితులకు భరోసా కల్పించారు.

%మూసీ పరివాహక ప్రాంతంలో ఉన్న ప్రజలను ఇబ్బంది పెడితే బీజేపీ ఊరుకోదని పోరాడుతుందని నేతలు స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని, మూసీపై సీఎం రేవంత్ రెడ్డి పూటకో మాట మాట్లాడుతున్నారని విమర్శించారు. డీపీఆర్ ఇవ్వకుండా అఖిలపక్షం మీటింగ్ ఏంటని ప్రశ్నించారు. మూసీ ప్రాంత ప్రజలను ఇబ్బంది పెట్టకుండా సుందరీకరణ చేస్తే తాము మద్దతు ఇస్తామని బీజేపీ నేతలు అన్నారు.



రుణమాఫీ పూర్తయ్యేదాకా వదలం..

అలాగే ఎన్నికల సమయంలో రైతాంగానికి ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసేదాకా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వెంటాడతామని బీజేపీ తేల్చిచెప్పింది. ముఖ్యంగా రూ.2లక్షల రుణమాఫీని సంపూర్ణంగా అమలు చేసేవరకూ వదలిపెట్టబోమని హెచ్చరించింది. బీఆర్ఎస్‌లాగే మోసం చేస్తూ ఉంటే చూస్తూ ఊరుకోబోమని కుండబద్దలు కొట్టింది. లక్షలాది మంది రైతాంగానికి అండగా ఉంటామని ప్రకటించింది. రూ.2 లక్షల రుణమాఫీకి ఆంక్షలెందుకు విధించారని నిలదీసింది. రైతుల ఓట్లతోనే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. వారినే దారుణంగా మోసం చేస్తోందని మండిపడింది. ఇప్పటి వరకు ఎంత మంది రైతులకు రుణమాఫీ చేశారో అధికారిక ప్రకటన విడుదల చేయాలని బీజేపీ డిమాండ్ చేసింది

## సచివాలయాన్ని ముట్టడించిన బెటాలియన్ పోలీస్ కుటుంబాలు

హైదరాబాద్: గత కొన్నిరోజులుగా జిల్లాల్లో కొనసాగుతున్న బెటాలియన్ పోలీస్ కుటుంబాల ఆందోళనలు హైదరాబాద్‌కు వ్యాపించాయి. బెటాలియన్ పోలీస్ కుంటుంబాల సభ్యులు సచివాలయ ముట్టడికి యత్నించారు. సెక్రటేరియట్ ముందు బెటాలియన్ కానిస్టేబుళ్ల భార్యలు, కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. ఒకే దగ్గర విధులు నిర్వర్తించేలా అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ మొండి వైఖరితో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఏక్ పోలీస్ హామీ ఏమైందని ప్రభుత్వాన్ని నిలదీశారు. తమ కుటుంబ సభ్యుల బాధలను అర్థం చేసుకోవాలన్నారు. కాగా, వారిని అడ్డుకున్న పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

'ఏక్ పోలీస్' హామీ ఏమైంది..

అందరి పోలీసుల్లాగే తమ భర్తలు కూడా పరీక్షలు రాసి, ఫిజికల్ టెస్టుల్లో పాసై, 9 నెలలు కఠోర శిక్షణ తీసుకున్నవారేగా? వాళ్లకెందుకు మిగతా సివిల్, ఏఆర్ పోలీసుల్లాగా ఒకే చోట డ్యూటీలు వేయరు? వాళ్లను కట్టుకున్న పాపానికి మేమేం తప్పు చేశాం? అంటూ బాధిత బెటాలియన్ కానిస్టేబుళ్ల భార్యలు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. 'మా భర్తలు ఏడాదికి మూడు జిల్లాలు తిరగాల్సి వస్తుంది. మేము ఎక్కడ ఉండాలి? మా బిడ్డలు ఎక్కడ చదువుకోవాలి? చేసేది పోలీసు ఉద్యోగమైనా ఈ తిరుగుడేంది?' అని



ప్రశ్నిస్తున్నారు. పోలీసు ఉద్యోగం చేస్తున్న తమ భర్తలను తోటి పోలీసులే జీతగాండ్లలాగా చూస్తున్నారని.. పొద్దున్నే పలుగు, పారలతో గడ్డి పీకిస్తున్నారని కన్నీటి పర్యంతమవుతున్నారు. రాష్ట్రంలో సివిల్, ఏఆర్ పోలీసుల మాదిరిగానే బెటాలియన్ పోలీసులకు వారు కోరుకున్న జిల్లాలో కనీసం 3-5 ఏండ్లు ఒకే చోట పనిచేసే వెసులుబాటు కల్పించాలని ప్రధానంగా డిమాండ్ చేస్తున్నారు. దీని వల్ల పిల్లల చదువులకు అంతరాయం లేకుండా ఉంటుందని, ఉద్యోగభారం తగ్గుతుందని చెబుతున్నారు.

## శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా సహించేది లేదని

**– ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్, ఫిరోజ్‌ఖాన్ అనుచరులను అడిషనల్ మేజిస్ట్రేట్ హోదాలో విచారించిన సీపీ సీవీ ఆనంద్**

హైదరాబాద్ సిటీ: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా సహించేది లేదని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్‌హెచ్చరించారు. అడిషనల్ డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేట్ హోదాలో ఆయన గురువారం కార్యనిర్వాహక న్యాయస్థానాన్ని నిర్వహించి పలు కేసులను విచారించారు. ఈ సందర్భంగా ఇటీవల హుమాయూన్‌నగర్ పోలీస్?స్టేషన్‌పరిధిలో కాంగ్రెస్, ఎంఐఎం పార్టీ వర్గీయుల మధ్య జరిగిన ఆధిపత్య పోరులో ఇరువర్గాలపై నమోదైన కేసును సీపీ విచారించారు. అక్టోబరు-7న హుమాయున్‌నగర్‌లోని ఫిరోజ్‌గాంధీనగర్‌లో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను ఎంఐఎం ఎమ్మెల్యే మహ్మద్ మాజిద్ హుస్సేన్(%వీ×వీ మీాూ వీశీష్టుఎమ్షు మీుయిఅు ుబంయిుఅ%) తన అనుచరులతో కలిసి పరిశీలిస్తున్నారు. అదే సమయానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు ఫిరోజ్‌ఖాన్ సీసీ రోడ్డు పనులను తనిఖీ చేయడానికి తన అనుచరులతో వచ్చారు. దీనికి ఎమ్మెల్యే అనుచరులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి వాగ్వాదం జరిగింది. గొడవ ముదిరి కొట్లాటకు దారితీసింది. తోపులాటలో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి.



ఈ నేపథ్యంలో స్థానికంగా శాంతి భద్రతలకు విఘాతం కలగడంతో పాటు, ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. పోలీసులు ఇరు వర్గాలను చెదరగొట్టి బీఎన్ఎస్ సెక్షన్ 194 కింద కేసులు నమోదు చేశారు. 107 సీఆర్‌పీసీ సెక్షన్ ప్రకారం.. శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన వ్యక్తులను అడిషనల్ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ హోదాలో సీపీ ఇరువర్గాలను విచారించారు. ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ గ్రూపులో 10 మంది, ఫిరోజ్‌ఖాన్ గ్రూపులో 9 మందిని సీపీ విచారించి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## 63 శాతం పెరిగిన మైక్రోసాఫ్ట్ సీఈవో వేతనం.. ఇప్పుడు ఎంతంటే..?

కార్పొరేట్ సంస్థల్లో చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ (సీఈఓ)లు అత్యంత కీలకం. వ్యూహ రచనలోనూ, ఆదాయం పెంపులోనూ, సిబ్బంది పనితీరు మెరుగు పర్చడంతోపాటు సాధక బాధకాలు తీర్చడంలోనూ సీఈఓలే కీలకం. ఇక ఐటీ, టెక్ సంస్థల సీఈఓలైతే వేరే చెప్పనక్కర్లేదు. సంస్థ పురోగతి సాధించడంలో ఎంతో ముఖ్య భూమిక పోషించే సీఈఓల వేతన భత్యాలు కూడా అదే స్థాయిలో ఉంటాయి. కంపెనీ షేర్లు లాభపడే కొద్దీ వారి జీత భత్యాలు కూడా అదేస్థాయిలో పెరుగుతుంటాయి. తాజాగా మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల వేతనం భారీగా పెరిగింది.

%2024 ఆర్థిక సంవత్సరంలో ఆయన వేతనం 79.1 మిలియన్ డాలర్లకు చేరింది. ఇది మన భారత కరెన్సీలో రూ.664 కోట్లతో సమానం. ఈ విషయాన్ని కంపెనీ తన రెగ్యులేటరీ ఫైలింగ్ లో పేర్కొంది. 2023 ఆర్థిక సంవత్సరంలో ఆయన 48.5 మిలియన్ డాలర్లు అందుకోగా.. దాంతో పోలిస్తే ఇది 63 శాతం అధికం జూన్‌లో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో మైక్రోసాఫ్ట్ వృద్ధిలో దూసుకెళ్లింది. దాంతో కంపెనీ షేర్లు సుమారు 31.2 శాతం లాభపడ్డాయి. ఈ కారణంగా మైక్రోసాఫ్ట్ మార్కెట్ విలువ 3 ట్రిలియన్ డాలర్లను అధిగమించింది. ఫలితంగా, నాదెళ్ల స్టాక్ అవార్డులు 39 మిలియన్ డాలర్ల నుంచి 71 మిలియన్ డాలర్లకు పెరిగాయి.

ఇక సంస్థకు ఆయన అందించిన సేవలకు గానూ సత్య నాదెళ్లకు 5.2 మిలియన్ డాలర్లు నగదు ప్రోత్సాహకం అందనున్నట్లు కంపెనీ ఫైలింగ్‌లో




తెలిపింది. అయితే ఆయనకు రావాల్సిన 10.7 మిలియన్ డాలర్ల కంటే ఇది తక్కువ. ఈ ఆర్థిక సంవత్సరంలో అనేక సైబర్ సెక్యూరిటీ ఉల్లంఘనల కారణంగా ప్రోత్సాహకం తగ్గినట్లు తెలుస్తోంది. మైక్రోసాఫ్ట్ సీఈఓగా గత పదేళ్ల కాలంలో సత్య నాదెళ్ల వినూత్న ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టారు. అనేక విషయాల్లో కీలక పాత్ర పోషించారు.

1975లో ప్రారంభించిన మైక్రోసాఫ్ట్‌లో నాదెళ్ల సీఈవోగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మైక్రోసాఫ్ట్‌లో కీలక మార్పులు జరిగాయి. క్లౌడ్ కంప్యూటింగ్, మొబైల్ అప్లికేషన్స్, కృత్రిమ మేధస్సు వంటి అంశాలపైనే ప్రధానంగా మైక్రోసాఫ్ట్ కేంద్రీకరించింది. దీంతో మైక్రోసాఫ్ట్ మార్కెట్ విలువ శరవేగంగా పెరిగింది. అసాధారణ రీతిలో కోవిడ్-19 ప్రభావం చూపినా నాదెళ్ల హయాంలో మైక్రోసాఫ్ట్ మంచి ఫలితాలు సాధించింది.

## సచివాలయాన్ని బఫర్ జోన్‌లో కట్టలేదా..

హైదరాబాద్ సిటీ: సచివాలయం బఫర్ జోన్‌లో కట్టలేదా.. అంటూ ఎంపీ ఈటల రాజేందర్‌ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గురువారం సాయంత్రం అత్తాపూర్ మూసీ పరివాహక ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జలవిహార్, ఐమాక్స్, సచివాలయం బఫర్ జోన్‌లో కట్టలేదా.. నీకో న్యాయం, ప్రజలకో న్యాయమా అని ప్రశ్నించారు. మూసీని శుభ్రం చేయాలని, పేదల భూములను మాత్రం లాక్కోవద్దని అన్నారు. మూసీ పునరుజ్జీవానికి ఇళ్లు కూల్చడం దేనికి అని ప్రశ్నించారు. డీపీఆర్(%ఱూ=%) లేకుండా, మార్కింగ్ ఎట్లా చేస్తారని మండిపడ్డారు. మూసీ ప్రక్షాళనకు తాము వ్యతిరేకం కాదని, అందులో విష రసాయనాలు, మురుగునీరు కలుస్తోందని, వాటిని అరికట్టాలని హితవు పలికారు. గత ముఖ్యమంత్రి హుస్సేన్‌సాగర్(%ఎబంయిుఅయిస్త్రుతీ%)ను ఎందుకు బాగు చేయలేదని ఈటల ప్రశ్నించారు. మూసీ, చెరువల పక్కన ఉన్నవాళ్లకు నాలుగు నెలలుగా కంటిమీద కునుకులేకుండా పోయిందన్నారు.



చెరువులు, మూసీ పక్కన ఉన్నవి అన్నీ ప్రభుత్వ భూములు కావని, పట్టా భూములు కూడా ఉన్నాయని, కొంతమంది బ్యాంక్ రుణాలు తీసుకొని ఇళ్లు కట్టుకున్నారని అన్నారు. స్థానికులు తమ సమస్యలను ఈటల రాజేందర్ దృష్టికి తీసుకెళ్లారు. తాము పట్టా భూములు కొనుక్కున్నామని, ప్రభుత్వమే రిజిస్ట్రేషన్ చేసి ఇప్పుడు అక్రమం అంటే తప్పు ఎవరిదని స్థానికులు ప్రశ్నించారు.

## వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో పత్తి రైతుల ఆందోళన..

వరంగల్ : వరంగల్ జిల్లాలో పత్తి రైతులుఆందోళన బాటపట్టారు. ఆరుగాలం శ్రమించి పంటలు గిట్టుబాటు ధరలు కల్పించడంలేదని కడుపు మండిన రైతన్నలు ఉద్యమ బాట పట్టారు. పత్తి ధర తగ్గించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసన చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే..వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో పత్తి ధర తగ్గిందని రైతులు ఆందోళనకుదిగారు. మార్కెట్‌లోని ఖరీదుదారులు పత్తికి తక్కువ ధర నిర్ణయిస్తున్నారని ఆరోపిస్తున్నారు. దీంతో మార్కెట్‌లో పత్తి కొనుగోళ్లు నిలిచిపోయాయి. మార్కెట్ కార్యదర్శి నిర్మల రైతు సంఘాల ప్రతినిధులు, ఖరీదుదారులతో చర్చలు జరుపుతున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



## పత్తి కొనుగోళ్లు.. ఇబ్బందులు పడుతున్న రైతులు

ఆదిలాబాద్ : ఆదిలాబాద్ జిల్లాలో పత్తి కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడంతో రైతులె ఇబ్బందులు పడుతున్నారు. తేమ పేరుతో అధికారులు కాలయాపన చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తేమ శాతం పరిగణలోకి తీసుకోకుండా సీసీఐ )పత్తి కొనుగోలును ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ రాజర్షి షా రైతులతో మాట్లాడే ప్రయత్నం చేశారు. 8 నుంచి 12% తేనే ఉంటేనే కొనుగోలు చేస్తామని అధికారులు ప్రకటించారు.

%దీంతో మార్కెట్‌కు భారీగా తరలి వచ్చిన రైతులు తీవ్ర నిరాశలో కూరుకుపోయారు. పంటలు పండించడం ఒక ఎత్తయితే చేతికొచ్చిన పంటను



అమ్ముకోవడం మరో సమస్యగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి గతంలో మాదిరిగా కొనుగోళ్లు చేపట్టాలని కోరుతున్నారు.

## ప్రజా భవన్‌లో గురుకుల టీచర్ అభ్యర్థుల ఆందోళన

హైదరాబాద్ : గురుకుల టీచర్స్ ఆందోనబాట పట్టారు. బ్యాక్ లాగ్ పోస్టులను అర్హులకు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ప్రజా భవన్‌లోఅభ్యర్థులు ఆందోళనకు దిగారు. అధికారులు నియమనిబంధనలు పాటించకపోవడంతో బ్యాక్ లాగ్ పోస్టులు మిగిపోయాయన్నారు. పరీక్ష రాసి అర్హత ఉన్నా ఉద్యోగాలు రాలేదని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం అర్హులైన వారికి పోస్టులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



## రైతులను మోసం చేసిన గొప్ప పార్టీ కాంగ్రెస్ : ఎమ్మెల్సీ రవీందర్ రావు

మహబూబాబాద్ : పండిన పంటను అంత కొంటాం, క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తమని నాడు చెప్పిన కాంగ్రెస్ నేడు సన్న వడ్లకు బోనస్ అని మాట మార్చిందని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు విమర్శించారు. మహబూబాబాద్ క్యాంప్ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రైతు భరోసా ఎగ్గొట్టి, 2 లక్షల రుణమాఫీ పేరుతో రైతులను మోసం చేసిన గొప్ప పార్టీ కాంగ్రెస్ అని ఎద్దేవా చేశారు. రేషన్ కార్డు పేరుతో అనేక డ్రామలడుతున్నారు.

వరదల వల్ల నష్టపోయిన మహబూబాబాద్ జిల్లా ప్రజలకు ఇంత వరకు ఏమీ చేయలేని అసమర్థ ప్రభుత్వం అని ఘాటుగా విమర్శించారు. తెలంగాణలో అన్ని రంగాల్లో అభివృద్ధి కుంటుపడుతున్నది. మూసీ మాటలు, హైడ్రా చర్యలు, సియోల్ పర్యటనలు ఇలా ఎన్నో రకాల అనాలోచిత నిర్ణయాలతో ప్రజలను భయ భ్రాంతు లకు గురి చేస్తుందని మండిపడ్డారు.



గ్రామాల్లో అభివృద్ధి, ఆరోగ్యం పడకేసింది. విద్య వ్యవస్థను గందరగోళంగా తయారు చేశారని పేర్కొన్నారు. అవినీతి అధికారులను, గిరిజనులను పిక్కతేనే అధికారులను వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు.

**సంపాదకీయం**

**శనివారం 26-10-2024**

# భయపెట్టే పచ్చదనం

పచ్చదనం కంటికి ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. భూగోళాన్ని రక్షిస్తుంది. అందుకే పెద్దఎత్తున చెట్లను పెంచాలని పర్యావరణవేత్తలు చెవిన ఇల్లు కట్టుకుని చెబుతుంటారు. కానీ, అంటార్కిటికా దీనికి భిన్నం. అక్కడ పెరుగుతున్న పచ్చదనం శాస్త్రవేత్తలను ఆందోళనకు గురిచేస్తోంది. భూగోళం భవిత ఏమిటన్న భయాన్ని కలిగిస్తోంది. ఏ వాతావరణ మార్పులను అడ్డుకోవడానికి చెట్లను పెంచాలని చెబుతారో, ఆ మార్పుల కారణంగానే అంటార్కిటికాలో పచ్చదనం పెరుగుతుండటమే దీనికి కారణం. దుప్పటి పరిచినట్టు కిలోమీటర్ల తరబడి తెల్లటి మంచు తప్ప మరేమీ కనపడని హిమఖండం అంటార్కిటికా వాతావరణ మార్పుల కారణంగా క్రమేణా వేడెక్కుతుండటంతో ఈ పరిస్థితి ఏర్పడుతోంది. ఉష్ణతాపానికి తరతరాలుగా ఇక్కడ పేరుకుపోయిన మంచు వేగంగా కరుగుతోంది. ఎంతగా అంటే, ఎప్పుడూ మైనస్ డిగ్రీలలో ఉండాల్సిన ఉష్ణోగ్రతలు వేసవిలో పది డిగ్రీల సెల్సియస్‌గా నమోదవుతున్నాయి. వేడి గాలులు కూడా వీస్తున్నాయి. భూగోళం మీద ఉష్ణోగ్రత పెరుగుదల రేటు అత్యధికంగా అంటార్కిటికాలోనే నమోదవుతున్నట్లు శాస్త్రవేత్తలు తేల్చారు. ఫలితంగా గత ఐదు సంవత్సరాల కాలంలోనే నాలుగు లక్షల మీటర్ల మేర పచ్చదనం విస్తరించింది. హిమానీ నదాలు కరుగుతున్నాయి. ఇది ఇలాగే కొనసాగితే సముద్రమట్టాలు పెరిగి భూగోళం ఉనికే ప్రశ్నార్థకంగా మారుతుంది. ఇదొక్కటే కాదు, ప్రపంచంలోనే అతి పెద్ద ఎడారి సహారాను ఇటీవల వరదలు ముంచెత్తడం కూడా ఇటువంటి ఆందోళన కలిగించే పరిణామమే! సెప్టెంబర్ నెలలో చోటుచేసుకున్న సహారా వర్షాలు, వరదలు చర్చనీయాంశంగా మారాయి. యూనివర్శిటీ ఆఫ్ సదరన్ కాలిఫోర్నియా శాస్త్రవేత్తలు చేసిన అధ్యయనం ప్రకారం తీవ్రమైన దుర్భిక్ష పరిస్థితులతో పాటు కలవరపరిచే వరదలు కూడా సహారా భవిష్యత్తులో భాగం కానున్నాయి. ఇసుక ప్రవాహాలకూ దారి తీసే ప్రమాదం ఉందని ఆ అధ్యయనం హెచ్చరించింది. అంతర్జాతీయ శాస్త్రవేత్తల బృందం రూపొందించిన 2024 స్టేట్ ఆఫ్ ది క్లైమేట్ రిపోర్టు ముంచుకొస్తున్న సంక్షోభం గురించి చేసిన హెచ్చరికను కూడా పరిగణలోకి తీసుకోవాల్సి ఉంది. ఉద్గారాల నియంత్రణలో వివిధ దేశాల ప్రభుత్వాలు తమ లక్ష్యాలను చేరుకున్నప్పటికీ ప్రపంచ ఉష్ణోగ్రతల స్థాయి 2.7 సెల్సియస్ డిగ్రీలకు పెరిగే ప్రమాదం ఉందని ఈ నివేదిక హెచ్చరించింది. సౌర, పవన ఇంధనాల వినియోగం పెరుగుతున్నప్పటికీ ప్రపంచ వ్యాప్తంగా శిలాజ ఇంధన వినియోగం తగ్గకపోగా ఏటికేడాది మరింతగా పెరుగుతోందని ఈ నివేదికలో శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. మన దేశంమీద కూడా ఈ పరిణామాలు తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. గత వేసవిలో అత్యధిక ఉష్ణోగ్రతలను చవి చూడగా, వర్షాకాలంలో భారీ వరదలు సృష్టించిన నష్టాలతో దేశం అతలాకుతలమైంది. కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, అస్సాంలతో పాటు మన రాష్ట్రానికి కూడా నైరుతి రుతుపవనాలు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. వరదల కారణంగా తరచూ ముంపునకు గురయ్యే ముంబై, ఢిల్లీ, బెంగళూరు వంటి మహానగరాల సరసన మన విజయవాడ కూడా చేరింది. అధికారిక లెక్కల ప్రకారం గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం రుతపవనాల సంబంధిత విపత్తుల వల్ల 1,400 మంది అధికంగా ప్రాణాలు కోల్పోయారు. ఒక్క హిమాచల్ ప్రదేశ్‌లోనే 200 మంది మరణించారు. ఆస్తి నష్టం గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. నివారణ చర్యల కంటే, విపత్తు అనంతర ఉపశమన చర్యలపైనే ప్రభుత్వాలు అధికంగా దృష్టి సారించడం ఈ పరిస్థితికి కారణం. వాతావరణ మార్పుల ప్రభావం అనివార్యంగా మారిన పరిస్థితుల్లో ప్రోయాక్టివ్ విధానాల అమలుకు ప్రభుత్వాలు సిద్ధం కావాల్సి ఉంది. ఈ దిశలో అవసరమైన సమగ్ర చర్యలను దేశ వ్యాప్తంగా చేపట్టాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంది. నవంబర్ నెలలో ఐక్యరాజ్యసమితి వార్షిక వాతావరణ చర్చలు (కాప్-29) అజర్‌బైజాన్‌లో జరగనున్నాయి. ఈ సమావేశంలోనైనా మన దేశం స్వతంత్ర గళం వినిపించాలి. ఉద్గారాల విషాన్ని వెదజల్లడంపై సంపన్న దేశాలను నిలదీయాలి. అటువంటి స్వతంత్ర వైఖరే వాతావరణ మార్పుల విపత్తుల నుండి మన దేశాన్ని, అంటార్కిటికా వంటి మంచు ఖండాల్ని, మొత్తం భూగోళాన్ని కాపాడుతుంది.

# రాజకీయాల్లో కుటుంబాల తిష్ట !



న్యూఢిల్లీ,భారత రాజకీయ వ్యవస్థ మొత్తం కుటుంబ రాజకీయాలకు ఆలవాలంగా ఉంటోంది. కుటుంబ రాజకీయాలకు దూరంగా ఉండాలన్న కల సాకారం కావడం లేదు. కాంగ్రెస్‌లో కుటుంబ రాజకీయాలు పెనవేసుకు పోయాయి. అలాగే ప్రాంతీయ పార్టీల్లో ఇది మరీ ఎక్కువగా ఉంది. ఒక్క కుటుంబంలో ఎంతమంది ఉంటే అందరూ రాజకీయాల్లో ఉండాలనుకుంటున్నారు. తాజాగా ప్రియాంక వాద్రా కూడా వయనాడ్ ద్వారా రాజకీయ అరంగేట్రం చేయడం చూస్తే ఇది మరోమారు స్పష్టం అవుతుంది. ఒక్కొక్కరు రెండమూడు చోట్లా పోటీ చేయడం, గెలిచాక మరొకరిని దింపడం వంటివన్నీ ఖజానాపై భారం పడేలా చేస్తున్నాయి. తొలుత ఒక్కచోటే పోటీ చేసేలా చట్టం రావాలి. అలాగే కుటుంబంలో ఒక్కరికే రాజకీయ ప్రవేశం ఉండేలా చేయాలి. అప్పుడే దేశ ప్రజాస్వామ్యంలో ఇతరులకు చోటు దక్కుతుంది. రాజీవ్ కుటుంబంలో ఇప్పుడు మరొకరు అంటే ప్రియాంక రాకతో పార్టీ పూర్తిగా వారి గుప్పిట్లోకి వెళుతోంది. రేపు ఎక్కడో ఒకచోటు నుంచి రాబర్ట్ వాద్రా కూడా రాజకీయ ప్రస్తానం మొదలవుతుంది. రాహుల్ ఇప్పటికే వయనాడ్ వదులుకోవడంతో ప్రియాంక ఎంటర్ అవుతున్నారు. రాహుల్ రాయబరేలిని దక్కించుకున్నారు. సోనియా రాజ్యసభలో ఉన్నారు. ఇంట్లో ఉన్న ముగ్గురూ ఎంపిలుగా ఉండబోతున్నారు. రాబర్ట్ కూడా వస్తే వారింట్లోనే నలుగురు అవుతారు. ఇది ఎంతవరకు న్యాయమో ప్రజలు ఆలోచన చేయాలి. ఇలా కుటుంబంలోని అందరినీ చట్టసభలకు పంపితే వారికి దేశం పట్ల ఏమాత్రం బాధ్యత, చిత్తశుద్ధి ఉంటుందో ప్రజలు ఆలోచించాలి. సోనియా కుటుంబంతో పాటు లాలూ ప్రసాద్ కుటుంబం, ఫరూక్ అబ్దుల్లా కుటుంబం, అమిత్ షా కుటుంబం, చంద్రబాబు కుటుంబం,కెసిఆర్ కుటుంబం, వెంకటస్వామి కుటుంబం.. కరుణానిధి కుటుంబం...ఇలా చెప్పు కుంటూ పోతే రాజకీయాల్లో అన్నీ కుటుంబాల అజమాయిషీలోకి వెళ్లాయి. వీరికి కుటుంబ అవసరాలు, స్వార్థం తప్ప ప్రజల గురించి ఆలోచన ఉండదు. భారత జనాభా 140 కోట్లకు చేరిన క్రమంలో ప్రజల ఆశలు, ఆకాంక్షలు అందుకే నెరవేరడం లేదు. పాలకులు ఎప్పుడూ వీరే కావడం, కొత్తవారికి అవకాశం లేకపోవడంతో మార్పులు కానరావడం లేదు. కుటుంబ పార్టీలు గుత్తాధిపత్యం చెలాయిస్తున్నాయి. అందుకే పాలనలో కొందరే నిరంతరంగా ఉండే విధానం పోవాలి. పార్లమెంట్, అసెంబ్లీలకు ఒక్కరినే నిరంతరంగా ఎన్నుకునే విధానం కూడా మంచిది కాదు. ఈ క్రమంలో రాజకీయాల్లో రొటేషన్ పద్దతి రావాలి. కుటుంబా లను దూరం పెట్టేలా సంస్కరణలు చేయాలి. ఒక్కరు ఒక్కచోటు నుంచే పోటీ చేయించగలగాలి. ఒక్కరికి రెండు పర్యాయాలు మించి అవకాశం లేకుండా చేయాలి. లేకుంటే వరుస పెట్టి వ్యాపారంలో లాగా అంతా రాజకీయాల్లో చేరి రాజకీయాలను, పాలనను వ్యాపారంగా మారుస్తున్నారు. అమెరికా తరహాలో కేవలం రెండు పర్యాయాలు మాత్రమే ఎన్నికల్లో పోటీచేసే విధానం రావాలి. ఒక్కరే ఏళ్లతరబడి ఎంపిలుగా, ఎమ్మెల్యేలుగా ఉండకుండా రెండు టర్మ్‌ల కాలాన్ని గరిష్టంగా నిర్ణయించాలి. ఈ మేరకు రాజ్యాంగంలో సవరణలు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎందుకంటే ఇప్పుడు ప్రియాంక రావడంతో మొత్తం సోనియా కుటుంబం పెత్తనంలోకి పార్టీ వెళ్లిపోయింది. ఖర్గే పేరుకే కాంగ్రెస్ అధ్యక్షుడు అని చెప్పాలి. లాలూ పార్టీ కావచ్చు, కెసిఆర్, కరుణానిధిల పార్టీలు కావచ్చు... వారే రాజ్యాం ఏలుతున్నారు. రాజకీయా లను మారిస్తేనే యువతకు అవకాశం వస్తుంది. యువత రాజకీయల్లోకి వస్తే మార్పులు కూడా వస్తాయి. దేశం పురోగమిస్తుంది. అందుకే ఎన్నికల్లో పోటీ చేసేవారికి అర్హతలను కూడా నిర్ణయించాలి. ఇలా అర్హతలు లేకపోవడం వల్లనే స్వాతంత్ర్యానంతరం ప్రజాస్వామ్య ఫలాలు అందరికీ అందడం లేదు. కొందరే పాలకులుగా ఉంటూ..ప్రజల ఆకాంక్షలను విస్మరిస్తున్నారు. అందుకే 75 ఏళ్ల స్వాతంత్యోత్సవంలో ఇంకా పేదలు పేదలుగానే ఉన్నారు. ఆకలి కోసం అలమటిస్తున్న వారు అలాగే ఉన్నారు. రాజకీయ నేతలు కూడా పేదల పేరు చెప్పి పబ్బం గడుపుకుంటున్నారు. ఇదంతా కూడా ప్రజలు కోరి తెచ్చుకున్న దౌర్భాగ్యంగా చూడాలి. మనం వేసే ఓటు సక్రమంగా పనిచేస్తుందా లేదా అన్నది ప్రజలు ఆలోచన చేయాలి. ఇలా రాజకీయ కుటుంబాలను మోయాల్సిన ఖర్మ మనకు లేదని గుర్తించాలి. కుటుంబ పార్టీలను దూరం పెట్టడం అలవాటు చేసుకోవాలి. వారికి ఓటేయకుండా గట్టిగా నిలబడాలి. మన ఓటును ఆయుధంగా చేసుకుని కుటుంబ సంక్షేమం కోసం పాటుపడే దగుల్బాజీ రాజకీయాలకు చరమగీతం పాడాలి. ప్రజలు పట్టించుకోని కారణంగా పాలకులు రాజకీయాలను వ్యాపారంగా మార్చుకుని, అధికారం చేతబట్టి శాసిస్తున్నారు. ప్రజలను ఓటుబ్యాంకుగా తయారుచేసుకుని వారిని మభ్యపెట్టడం అలవర్చుకున్నారు. ఎన్నికల అక్రమాల్లో ఆరితేరిన నేతలంతా పాలకులుగా పెత్తనం చెలాయిస్తున్నారు. ఓట్లను కొనుగోలు చేయడం ఎలాగో నేర్చుకున్నారు. తమకు అనుకూలమైన ఎన్నికల అధికారులను, పోలీస్ అధికారులను అడ్డం పెట్టుకుని ఓట్లను వేయించుకుని ఎన్నికవుతున్నారు. ఈ విధానం పోవాలంటే ఎన్నికల్లో భారీ సంస్కరణలు రావాలి. ఒక్కరే నిరంతరంగా పదవిని పట్టుకుని ఉండే పద్దతికి స్వస్తి పలకాలి. కుటుంబాల నుంచి ఒక్కరికే ఛాన్స్ అన్నది రావాలి. ఎంపి, లేదా ఎమ్మెల్యేగా గెలిచిన వారు రెండు టర్మ్‌లకు మించి పనిచేయకుండా చట్టబద్ద విధానం అమల్లోకి తీసుకుని రావాలి. జమిలి ఎన్నికలను వ్యతిరేకిస్తున్నది కేవలం ఓటమికి భయపడే అని ప్రజలు గుర్తించాలి. తరచూ ఎన్నికలు దేశ ఖజానాను దోచేస్తున్నాయి. జమిలి ఎన్నికలకు నిలబడ్డ బిజెపి, ఇలాంటి సంస్కరణ లను కూడా తేవాలి. కుటుంబ పార్టీలను దూరం పెట్టాలి. లేదా కుటుంబంలో ఒక్కరే రాజకీయాలకు అర్హులుగా చేయాలి. అప్పుడే మార్పు వస్తుంది. అప్పుడే ఇంటిల్లిపాదీ రాజకీయాల్లో చేరి ప్రజల నెత్తిన కూర్చునే ఖర్మ తప్పుతుంది. ప్రజాస్వామ్యం బలపడుతుంది.

# కుటుంబం అంతా జగన్..మాయ !



అమరావతి,జగన్ అంతరంగం ఏమిటో బయటపడ్డది. చెల్లికి తల్లికి వాటా చెల్లించకుండా కేసులు వేసిన ఘనుడు ..ప్రజలకు మేలు చేస్తాడని, చేశాడని అనుకోవడం భ్రమే అవుతుంది. నీకింత..నాకింత అన్న చందంగా ఐదేళ్లు రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన జగన్ ఓ మంచి నేతగా మాత్రం నిరూపించుకోలేక పోయారు. అందివచ్చిన అవకాశాన్ని చేజార్చుకున్నారు. ప్రజలు ఇచ్చిన అవకాశంతో ఎపిని దేశంలోనే అగ్రభాగానా నిలిపే అవకాశం వచ్చినా వదులుకున్నారు. ఐదేళ్లలో పోలవరం పూర్తి చేయలేదు. రాజధాని అన్నది లేకుండా చేశారు. అభివృద్ధి అన్నది లేకుండ ఆచేశారు. బటన్ నొక్కుడే అభివృద్ధి అని భ్రమింప చేశారు. విశాఖలో రాజసౌధాలు నిర్మించుకున్నారు. తానే మళ్లీ ముఖ్యమంత్రి అయి..అందులో విలాసాలు సాగించాలని అనుకున్నారు. ఇలా చెప్పకుంటూ పోతే అనేకం ఉన్నాయి. ప్రజలను ఓటింగ్ యంత్రాలుగా గుర్తించి వారికి తాయిలాలు పంచి, వారినుంచి ఓట్లు పొందాలని చూశారు. కానీ ప్రజలు జగన్ నైజాన్ని గమనించి గట్టిగా బుద్ది చెప్పారు. ఇంతటి వికృత ప్రవర్తన కలిగిన వ్యక్తి.. దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేరును భ్రష్టు పట్టించారు. తండ్రిలా జగన్ ఏనాడూ ప్రజల గురించి ఆలోచించలేదు. ప్రజలను దూరం పెట్టారు. ఇప్పుడు అధికారం పోగానే నా ప్రజలో అంటూ పోలోమని పోవడం..పరామర్శించడం మాత్రం నేర్చుకున్నారు. ఇలా నమ్మిన ప్రజలే జగన్‌ను గద్దె నెక్కించిన పాపానికి ఐదేళ్లపాటు అష్టకష్టాలు అనుభవించారు. రాజధాని లేకుండా పోయింది. అడుగు మేర రోడ్డు కూడా పడలేదు. లిక్కర్, ఇసుక, భూముల దోపిడీ జరిగింది. ఈ విషయంలో ఎంత చెప్పుకున్నా తక్కువే. ఇంతలా విపరీత ప్రవర్తన ఉన్న జగన్ తన చిన్నాన్న మర్డర్ కేసును తేల్చాలని ఏనాడూ భావించలేదు. ఇప్పుడు కుటుంబానికి న్యాయం చేయడానికి ముందుకు రావడం లేదు. అందుకే జగన్ చుట్టూ ఇలాంటి వారే చేరారు. మాట తప్పను.. మడమ తిప్పను అని పదేపదే చెప్పే వైకాపా అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తన సొంత కుటుంబంలోని తల్లి, చెల్లి విషయంలోనే మాట తప్పి, మడమ తిప్పారు. ప్రేమతో చెల్లికి ఆస్తులు ఇస్తానని అవగాహన ఒప్పందం కుదుర్చుకుని మరీ ఇప్పుడు తూచ్ ఇవ్వనుపో అన్నారు. రాజకీయంగా విభేదించారన్న కారణంగా తల్లి విజయమ్మ, చెల్లి షర్మిలపై ఏకంగా కోర్టుకెక్కారు. షర్మిల రాజకీయంగా, వ్యక్తిగతంగా ఆరోపణలు చేసి తన పరువు, ప్రతిష్ఠలను దెబ్బతీశారని, ఆమెకు తనపై ప్రేమ లేదని తేలిందని, అందువల్ల చెల్లికి ఇచ్చిన గిఫ్ట్‌డీడ్‌ను రద్దు చేసుకుంటున్నానని వెల్లడించారు. ఆమెను దూరం పెట్టిందే జగన్. ఆమెను రాజకీయంగా దూరం చేసి, ఏకాకిని చేసిన తరవాతనే షర్మిల తెలంగాణలో కాలు మోపారు. తల్లిని పార్టీ బాధ్యతల నుంచి దూరం చేశారు. ఇవన్నీ కూడా కావాలనే చేసిన జగన్ ఇప్పుడు ఆస్తుల విషయంలో అందుకు భిన్నంగా వ్యవహరిస్తారని అనుకోవడం మనదే తప్పు. జగన్ ప్రజల ఆస్తులనే తనవిగా చేసుకున్న తీరును గత ఐదేళ్లలో చూశాం. ఎపిని 50 ఏళ్లపాటు వెనక్కి నెట్టారు. ఫ్యూడల్ మనస్తత్వంతో పాలన చేసే వారికి తరతమ భేదాలు ఉండవు. అందుకే ఇప్పుడు ఇంట్లోనూ వాటాలు, ఆస్తుల గొడవలు సృష్టించారు. ఇలాంటి వారు ఎంతకైనా తెగిస్తారని షర్మిల అంటూనే ఉన్నారు. ప్రేమానుబంధాలతో ఆస్తుల్లో వాటా ఇచ్చారన్న కృతజ్ఞత లేకుండా షర్మిల తనకు వ్యతిరేకంగా చర్యలు చేపట్టిందని జగన్, భారతిలు పేర్కొన్నారు. అంతేగాకుండా అవాస్తవాలు, తప్పుడు ప్రకటనలు చేశారని పేర్కొన్నారు.ఈ చర్యలు తనను రాజకీయంగా వ్యతిరేకించడంతోపాటు వ్యక్తిగత ప్రతిష్ట దెబ్బతీశాయన్నారు. అంతేగాకుండా అన్నాచెల్లెళ్ల అనుబంధంపై ప్రభావం చూపి ప్రేమ, అనుబంధాలను తగ్గించేలా చేశాయన్నారు. రాజకీయ ప్రేరేపితు రాలైన చెల్లి వ్యక్తిగతంగాను బురద చల్లారని, దీంతో ఆవేదనకు గురైన తాను తమ మధ్య ఎలాంటి ప్రేమ మిగలలేదని గుర్తించినట్లు తెలిపారు. అందుకే చెల్లికి ఇవ్వాలన్న వాటాలు ఇవ్వడానికి చేసిన అవగాహన ఒప్పందం, తల్లికి గిఫ్ట్‌డీడ్ అమలు చేయకూడదని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. షర్మిల దురుద్దేశపూరిత చర్యల ద్వారా వాటాల బదలాయింపు అక్రమంగా జరిగాయని పేర్కొన్నారు. నిజమే రేపు..ఓటర్లు కూడా తమకు ఓటేయలేదని వారికి ఎలాంటి ప్రయోజనాలు కల్పించబోనని కూడా జగన్ చెప్పే ఆస్కారం ఉంది. జగన్ ప్రవర్తనను గుర్తించి ఓటర్లు ఇప్పటి నుంచే జాగ్రత్తగా ఉండాలి. తన ప్రయోజనాలకు భిన్నంగా ఉండే ఎవరిని కూడా జగన్ క్షమించరు. వారు కుటుంబ సభ్యులైనా, రాజకీయ నేతలైనా, ప్రజలైనా జగన్‌కు ఒక్కటే. ఐదేళ్ల పాలనలో ఇదే అనుసరించారు. ఇప్పుడు కుటుంబంలో అనుసరిస్తున్నారు. చెల్లి షర్మిలకు ఆస్తి పంపకాల్లో భాగం ఇవ్వడానికి కుదిరిన ఒప్పందంలో భాగంగా ట్రస్టీగా తల్లి విజయమ్మ పేరుతో గిఫ్ట్‌డీడ్ చేసిన జగన్ ఇప్పుడు దాన్ని రద్దు చేసుకుంటానంటున్నారు. గిఫ్ట్‌డీడ్‌లో పేర్కొన్న ఆస్తులను ఆటంకాలు లేకుండా అనుభవించవచ్చని, ఇందులో దాతతోపాటు ఎవరూ జోక్యం చేసుకోరనేది ఒప్పందంలో కీలకాంశం. అయితే తనతో సహా ఎవరూ ఆస్తి పంపకాల్లో జోక్యం చేసుకోరని హామీ ఇచ్చాక దానికి విరుద్ధంగా రద్దు చేసుకోవడం చెల్లదని న్యాయనిపుణులు చెబుతున్నారు. తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సంపాదించిన ఆస్తుల్లో తనకు, తన పిల్లలకు దక్కాల్సిన వాటా ఇవ్వకుండా.. సోదరుడు జగన్ అన్యాయం చేశారని మరోవైపు వైఎస్ షర్మిల తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తమకు అరకొర ఆస్తులిచ్చి వెళ్లగొట్టాలని చూడటమే కాకుండా, ఆస్తుల పంపకానికి సంబంధించి తనతో చేసుకున్న ఒప్పందాన్ని కూడా తుంగలో తొక్కారని మండిపడ్డారు. తల్లిపైనా, చెల్లిపైనా కేసు పెట్టి, కుటుంబాన్ని కోర్టుకీడ్చేంత నీచానికి ఒడిగట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్తుల విషయం సెటిల్ చేసుకోవాలంటే.. జగన్‌కు, అవినాష్‌రెడ్డికి వ్యతిరేకంగా మాట్లాడకూడదని తనకు షరతు పెట్టడంపై ఆమె తీవ్రంగా మండిపడ్డారు. మొత్తంగా జగన్ ఆస్తుల గొడవ కారణంగా ఆయన మనస్తత్వం ప్రజలకు అర్థం అయివుండాలి. ఐదేళ్లుగా అనుభవంలోకి వచ్చి ఉండాలి. అందువల్ల ఎపి ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిందే. జగన్ లాంటి నేతలు ఆత్మ పరిశీలన చేసుకోవాలి. రాజకీయాల్లో త్యాగాలు చేయని వారిని కూడా ప్రజలు ఆదరించరాదు.

# ఉత్తరాంధ్రపై తుఫాన్ ప్రభావం

విశాఖపట్నం, బంగాళాఖాతంలో ఏర్పడిన దానా తుఫాన్.. ఎలాంటి బీభత్సం సృష్టిస్తుందని ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. దానా తుఫాన్ తీవ్ర తుఫాన్‌గా మారిందని వాతావరణశ్శాఖ అధికారులు అన్నారు. అర్ధరాత్రి నుంచి శుక్రవారం ఉదయం మధ్య.. ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరం వద్ద దాటుతుందని తెలిపారు. ఈ సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యంగా ఉత్తరాంధ్రపై తుఫాన్ ప్రభావం ఉంటుందని తెలిపారు. ఉత్తరాంధ్ర తీరం వెంబడి బలమైన గాలులు వీస్తాయని వెల్లడించారు. కళింగపట్నం, భీమునిపట్నం, విశాఖపట్నం , గంగవరం పోర్టుల్లో మూడో ప్రమాద హెచ్చరికలు జారీ చేశామని అన్నారు. తుఫాన్ తీరం దాటిన తర్వాత ఉత్తరాంధ్రలో ఉరుములతో కూడిన వర్షాలు పడతాయని తెలిపారు. అక్కడక్కడ భారీ వర్షాలు పడే అవకాశం ఉందని అన్నారు. ఈ సమయంలో మత్స్యకారులు ఎవరు వేటకు వెళ్లొద్దని అధికారులు హెచ్చరించారు. గురువారం ఒడిశాలో తుఫాన్ తీరం దాటనుంది. తుఫాన్ ప్రభావం జిల్లాపై ఎక్కువగా చూపనుందని.. ఇప్పటికే వాతావరణ శాఖ అంచనా వేసింది. గురువారం బలమైన ఈదురుగాలులు.. గంటకు 80 నుంచి 100 కిలోమిటర్ల వేగంతో వీస్తాయని వెల్లడించింది. దీంతో జిల్లా అధికారులను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అప్రమత్తం చేశారు. కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ (08942-240557) ఏర్పాటు చేశారు. ప్రతి మండల కేంద్రంలోనూ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయించారు. తుఫాన్ తీరం దాటాక.. భారీవర్షాలు రెండు రోజుల పాటు కురుస్తాయని.. పైగా ఇచ్ఛాపురం నియోజకవర్గంలో సోంపేట, ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి మండలాలపై ఎక్కువగా ప్రభావం ఉంటుందని నివేదికలో వెల్లడైంది. దీంతో ఆయా మండలాల్లో అధికారులను కలెక్టర్ అప్రమత్తం చేశారు. ప్రజలందరూ ముందస్తు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. అవసరమైతే కంట్రోల్‌రూమ్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి రెండు గంటలకు ఇచ్ఛాపురం నియోజకవర్గం గురించి ప్రత్యేక బులిటెన్ విడుదల చేయనున్నారు. తీరప్రాంత మండలాల్లో తుపాను ప్రభావాన్ని.. నష్టాన్ని గుర్తించేందుకు.. ఇరవై డ్రోన్లను సిద్ధం చేశారు. సమాచారాన్ని ఎప్పటికప్పుడు గూగుల్ షీట్స్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకున్నారు. అలాగే నాగావళి, వంశధార, బహుదా నదులు.. సాగునీటి చెరువులు... సముద్ర తీరప్రాంతాల వద్ద ప్రజలు వెళ్లకుండా హెచ్చరికలు జారీ చేశారు. తుఫాన్ రక్షణ చర్యలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కలెక్టర్, ఎస్పీలతో మాట్లాడారు. ప్రజలకు ఏవిధమైన నష్టం కలగకుండా.. సకాలంలో సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రణస్థలం మండలం కొవ్వాడ నుంచి ఇచ్ఛాపురం మండలం డొంకూరు సముద్రతీరం వరకు బుధవారం సాయంత్రం నుంచీ ఈదురుగాలులు వీస్తున్నాయి. అలలు ఎగసి పడుతున్నాయి. తుఫాన్ నేపథ్యంలో ప్రధానంగా ఉద్దానం ప్రజలు భయాందోళన చెందుతున్నారు. తితలీ తుఫాన్ సృష్టించిన బీభత్సాన్ని ఇప్పటికీ మరచిపోలేకపోతున్నారు. తాజాగా దానా తుఫాన్ ప్రభావంతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో రైతుల్లో ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో హిరమండలం, జలుమూరు తదితర మండలాల్లో వరి పంట కోత దశకు చేరుకుంది. ఈ సమయంలో తుఫాన్ వస్తే.. తమకు పంట నష్టం తప్పదని రైతులు వాపోతున్నారు. ఎకరాకు రూ.25వేలకు పైగా ఖర్చు చేశామని.. పంట చేతికి అందివచ్చే సమయంలో తుఫాన్ ముప్పు వెంటాడుతోందని ఆవేదన చెందుతున్నారు.

# తుఫాన్ ప్రభావంతో పలు రైళ్లు రద్దు

శ్రీకాకుళం, తుఫాను కారణంగా ఈ నెల 24, 25 తేదీల్లో ఈస్ట్‌కోస్ట్ రైల్వే పరిధిలో అనేక రైళ్లు రద్దు చేసినట్లు రైల్వేశాఖ పీఆర్వో ఓ ప్రకటన విడుదల చేశారు. 24న కటక్-పారాదీప్ స్పెషల్, భువనేశ్వర్-ముంబై కోణార్క్ ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్-చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్-ఆనంద్‌విహార్ ఎక్స్‌ప్రెస్, పూరీ-షాలీమార్, న్యూఢిల్లీ-భువనేశ్వర్ ఎక్స్‌ప్రెస్, బెంగుళూరు-హౌరా ఎక్స్‌ప్రెస్ రద్దు కానున్నాయి. 25న పారాదీప్-పూరీ ఎక్స్‌ప్రెస్, చెన్నై-భువనేశ్వర్ ఎక్స్‌ప్రెస్, షాలీమార్-పూరీ, భద్రక్-ఖరగ్‌పూర్ స్పెషల్ రైళ్లను రద్దు చేసినట్టు ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్‌లో హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశారు. దానా తుఫాన్ ప్రభావంతో ఈ నెల 24, 25, 26 తేదీల్లో అటు భువనేశ్వర్, ఇటు విజయవాడ వైపు వెళ్లే 51 రైళ్లను రద్దు చేసినట్టు రైల్వే అధికారులు వెల్లడించారు. రైల్వే ప్రయాణికులకు ఎటువంటి సమాచారం కావాలన్నా హెల్ప్‌లైన్ డెస్క్ సిబ్బందిని లేదా.. టోల్‌ఫ్రీ 08942- 286 213, 85912 85913 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

# ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం శుభవార్త

న్యూఢిల్లీ,ఆంధ్రప్రదేశ్ ప్రజలకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. అమరావతికి 57 కి.మీ.ల మేర కొత్త రైల్వే లైన్ ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపినట్టు రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు. రాజధాని నిర్మాణం జరగనుండడంతో రైల్వే లైన్ మరింత దోహదపడనుంది రూ.2,245 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టుకు పచ్చజెండా ఊపింది. హైదరాబాద్, కోల్‌కతా, చెన్నై సహా దేశంలోని ప్రధాన మెట్రో నగరాలతో రాజధాని అమరావతిని కలుపుతూ కొత్త రైల్వే ప్రాజెక్టు చేపట్టనున్నట్టు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా కృష్ణా నది పై 3.2 కి.మీ పొడవైన వంతెన నిర్మాణం చేపట్టనున్నారు. ఏపీలో కొత్త రైల్వే లైన్ అమరావతి మీదుగా ఎర్రుపాలెం నుంచి నంబూరు మధ్య ఏర్పాటు కానుంది. ఈ రైల్వే లైన్‌తో దక్షిణ, మధ్య, ఉత్తర భారత్‌తో అనుసంధానం మరింత సులువు కానుంది. అమరావతి స్తూపం, ఉండవల్లి గుహలు, అమర లింగేశ్వరస్వామి ఆలయం, ధ్యానబుద్ధ ప్రాజెక్టుకు వెళ్లే వారికి సులువైన మార్గంగా అభివృద్ధి చేయనున్నారు. మచిలీపట్నం, కృష్ణపట్నం, కాకినాడ పోర్టులను అనుసంధానిస్తూ ఈ రైల్వేలైన్ ఏర్పాటు కానుంది. బిహార్‌లో రూ.4,553 కోట్ల అంచనా వ్యయంతో రైల్వే ప్రాజెక్టుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. నర్కతియాగంజ్-రక్సాల్- సీతామఢీ-దర్భంగా; సీతామఢీ-ముజఫర్‌పూర్ కారిడార్ డబ్లింగ్ పనులు చేపట్టనున్నారు. మొత్తంగా 256 కిలోమిటర్ల పొడవైన ఈ ప్రాజెక్టుతో ఉత్తరప్రదేశ్, ఉత్తర బిహార్‌లకు ప్రయోజనం చేకూరనుంది. ఏపీ, బిహార్‌లలో చేపట్టే ఈ రైల్వే ప్రాజెక్టులను నాలుగేళ్లలో పూర్తి చేయనున్నారు. అంతరిక్ష రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు రూ.1,000 కోట్ల వెంచర్ క్యాపిటల్ ఫండ్ ఏర్పాటుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ ఫండ్ దాదాపు 40 స్టార్టప్‌లకు తోడ్పాటు అందించే అవకాశం. అంతర్జాతీయంగా పోటీతత్వాన్ని బలోపేతం చేయడంతో పాటు ఆత్మనిర్భర్ భారత్‌కు మరింత ప్రోత్సహం కల్పించేలా ఈ నిధి ఉపయోగపడనుంది.

# తెలంగాణలోనే సొంతంగా సీడ్ గార్డెన్

హైదరాబాద్, భవిష్యత్తులో తెలంగాణలోనే సొంతంగా సీడ్ గార్డెన్ ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలిస్తున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మలేసియా పర్యటనలో ఉన్న మంత్రి.. రెండో రోజు పలు సంస్థలను సందర్శించారు. ప్రపంచంలో అతి పెద్ద వ్యాపార ఆధారిత క్రూడ్ పామాయిల్ ఉత్పత్తిదారుల్లో ఒకటైన ఎఫ్‌జీవీ కంపెనీ సీడ్ గా÷-ర్డ÷న్‌ను సందర్శించారు. నర్సరీలను, అధునాతన సాంకేతిక పద్ధతులతో ఉన్న విత్తన కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఆ కంపెనీ ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సొంతంగా సీడ్ గా÷-ర్డ÷న్ ఏర్పాటుకు ఎఫ్‌జీవీ కంపెనీ సహకారంకావాలని కోరారు. అందుకు రాష్ట్ర భాగస్వామ్యంతో పని చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. అనంతరం ఎఫ్‌జీవీ కంపెనీ రి÷ఫైనరీ కర్మాగారాన్ని సందర్శించి అక్కడ తయారు చేసే వివిధ ఉత్పత్తులను మంత్రి పరిశీలించారు. కంపెనీ తీసుకునే జాగ్రత్తలు, వివిధ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న డిమాండ్ గురించి మంత్రి తుమ్మలతోపాటు అధ్యయన బృందానికి ఆ సంస్థ ప్రతినిధులు వివరించారు.

# తెలంగాణలో పెట్టుబడులకు జర్మనీ ఆసక్తి

హైదరాబాద్,తెలంగాణలో పెట్టుబడులు, వ్యాపార భాగస్వామ్యాలకు జర్మనీలోని రైన్‌ల్యాండ్ రాష్ట్రం ఆసక్తి కనబర్చిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. రైన్‌ల్యాండ్‌కు చెందిన ఉన్నతస్థాయి ప్రతినిధుల బృందం సచివాలయంలో శ్రీధర్ బాబుతో భేటీ అయింది. రైన్‌ల్యాండ్ మంత్రి డానియెల్ బృందం, చెన్నైలోని జర్మనీ కాన్సుల్ జనరల్ మైకెల కలిసి పెట్టుబడులపై మంత్రితో చర్చించారు. ఫార్మా ఉత్పత్తులు, బయోటెక్నాలజీ, వ్యాక్సిన్లు, ప్యాకేజింగ్, పౌల్ట్రీ, వ్యవసాయం, ఆటోమొబైల్స్, లాజిస్టిక్స్ వంటి విభాగాల్లో భాగస్వాములు కావడం, పెట్టుబడులు పెట్టే అవకాశాలపై చర్చించారు. సులభతర వాణిజ్య విధానాలు, తక్షణ అనుమతుల జారీలో తెలంగాణ అగ్రగామిగా ఉందని ఈ సందర్భంగా జర్మనీ బృందానికి శ్రీధర్ బాబు తెలిపారు. నూతన ఆవిష్కరణలు, ఆధునిక పరిశోధనలను ప్రోత్సహించే విధంగా ప్రపంచ స్థాయి వ్యవస్థను ఏర్పాటు చేయడంపై దృష్టి సారించామన్నారు. లైఫ్ సైన్సెస్, ఫార్మా పెట్టుబడులకు తెలంగాణ ప్రపంచ స్థాయి గమ్యస్థానంగా నిలుస్తోందన్నారు. నైపుణ్యం కలిగిన మానవ వనరుల లభ్యతతో పాటు అత్యున్నత మౌలిక సదుపాయాలతో పరిశ్రమ దృష్టిని ఆకర్షిస్తోందని అన్నారు. హైదరాబాద్‌లో జరిగే బయో ఆసియా-2025 సదస్సుకు హాజరు కావాలని శ్రీధర్ బాబు.. ప్రతినిధుల బృందాన్ని కోరారు. రైన్‌ల్యాండ్, తెలంగాణ రాష్ట్రాలు ఇకపై పరస్పర సహకార సంబంధాలు కలిగి ఉండాలని ఇరు పక్షాలు అంగీకరించాయి. రైన్‌ల్యాండ్‌ను సందర్శించి అక్కడి అభివృద్ధిని పరిశీలించాలని మంత్రి డానియెల్ బృందం శ్రీధర్ బాబును ఆహ్వానించింది.

# ఎట్టకేలకు జానీ మాస్టర్‌కు బెయిల్

హైదరాబాద్, లైంగిక వేధింపుల కేసులో నిందితుడిగా ఉన్న కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌కు బెయిల్ మంజూరైంది. తనని లైంగికంగా వేధించారన్న మహిళా కొరియోగ్రాఫర్ ఫిర్యాదు మేరకు ఆయనపై పోలీసులు పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో రెండు వారాలుగా ఆయన చంచల్‌గూడ జైలులో ఉన్నారు. పోక్సో చట్టం కింద కేసు నమోదవడంతో ఆయనకు ప్రకటించిన నేషనల్ అవార్డును నిలిపివేస్తున్నట్లు అవార్డుల కమిటీ ప్రకటించింది. ఈ అవార్డు ఫంక్షన్ కోసం జానీ మాస్టర్ మధ్యంతర బెయిల్ కూడా పొందారు. తాజాగా మరోసారి తనకు బెయిల్ మంజూరు చేయాలని న్యాయస్థానాన్ని ఆశ్రయించగా షరతులతో కూడిన బెయిల్ మంజూరైంది. జానీ తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడంటూ ఆయన అసిస్టెంట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. 2017లో జానీ మాస్టర్ పరిచయ మయ్యాడు. 2019లో అతని బృందంలో సహాయ నృత్య దర్శకురాలిగా చేరాను. ముంబయిలో ఓ సినిమా చిత్రీకరణ నిమిత్తం జానీ మాస్టర్‌తో పాటు నేను, మరో ఇద్దరు సహాయకులం వెళ్లాం. అక్కడ హోటల్‌లో నాపై జానీ మాస్టర్ అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే పని నుంచి తొలగిస్తానని, సినిమా పరిశ్రమలో ఎప్పటికీ పని చేయలేవని బెదిరించాడు. దీన్ని అవకాశంగా తీసుకుని.. హైదరాబాద్ నుంచి ఇతర నగరాలకు సినిమా చిత్రీకరణకు తీసుకెళ్లిన సందర్భాల్లో పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. షూటింగ్ సమయంలోనూ వ్యానిటీ వ్యాన్‌లో అసభ్యంగా ప్రవర్తించేవాడు. వేధింపులు భరించలేక జానీ మాస్టర్ బృందం నుంచి బయటకొచ్చేశాను. అయినా సొంతంగా పని చేసుకోనివ్వకుండా, ఇతర ప్రాజెక్టులు రానీయకుండా ఇబ్బంది పెట్టాడని ఫిర్యాదులో బాధితురాలు పేర్కొన్నారు.

# సెబి చీఫ్ గైర్హాజరు

న్యూఢిల్లీ,పార్లమెంటరీ కమిటీ సమావేశానికి సెబీ చీఫ్ మాధబి పురీ బచ్ గైర్హాజరయ్యారు. దేశంలోని నియంత్రణ సంస్థల పనితీరును సమీక్షించేందుకు సెబీ చీఫ్‌కు పార్లమెంటరీ కమిటీ సమన్లు జారీ చేసిన విషయం తెలిసిందే. దీంతో గురువారం ఆమె కమిటీ ముందు హాజరుకావాల్సి ఉంది. అయితే కొన్ని ముఖ్యమైన కారణాలరీత్యా తాను హాజరుకాలేనని కమిటీకి తెలియజేశారు. దీంతో రివ్యూ కమిటీ సమావేశాన్ని వాయిదా వేసినట్లు తెలుస్తోంది. సెబీ చీఫ్ గైర్హాజరుపై ప్యానెల్‌కు నేతృత్వం వహిస్తున్న కాంగ్రెస్ సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ స్పందించారు. మొదటి కమిటీ సమావేశంలో రెగ్యులేటరీ పనితీరుపై సమీక్షించాలని భావించాం. మీటింగ్ కోసం సంబంధిత వ్యక్తులకు నోటీసులు పంపాం. వారు సమావేశం నుంచి మినహాయింపు కోరారు. కానీ మేం దాన్ని తిరస్కరించాం. ఆ తర్వాత తాను, తన బృందంతో కలిసి మీటింగ్‌కు హాజరవుతామని తెలిపారు. అయితే కొన్ని ముఖ్యమైన కారణాల వల్ల ఆమె ఢిల్లీకి వచ్చే పరిస్థితి లేదని ఉదయం 9:30గంటలకు మాకు సమాచారం అందింది. ఆమె అభ్యర్థనను పరిగణలోకి తీసుకుని సమావేశాన్ని వాయిదా వేశాం'అని తెలిపారు. బచ్‌కు పీఏసీ కమిటీ సమన్లు పంపడం ఇది రెండో సారి.

### జీవన్ రెడ్డి వ్యాఖ్యలను స్వాగతించిన వేముల

నిజామాబాద్,కాంగ్రెస్ ప్రభుత్వానికి దమ్ముంటే పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసి ఎన్నికలకు వెళ్లాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ప్రభుత్వానికి సవాల్ విసిరారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై వేటు వేయాలని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్యే వేముల స్పందించారు. మా పార్టీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, శాసన సభాపతి ప్రసాద్, ఎమ్మెల్సీ గుత్తా సుఖేందర్ రెడ్డి త్వరగా నిర్ణయం తీసుకోవాలన్నారు.

# ఒమర్.. రాష్ట్ర హోదా సాధించేనా?

జమ్మూకశ్మీర్:భారతదేశంలో నూతన కేంద్రపాలిత ప్రాంతమైన జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రిగా కొత్తగా ప్రమాణం చేసిన నేషనల్ కాన్ఫరెన్స్ మూడో తరం నేత ఒమర్ అబ్దుల్లాది ఇతర ముఖ్యమంత్రులెవరికీ లేని అపూర్వ పరిస్థితి. ఎన్నికైన తొలి షేక్ అబ్దుల్లా మనవడు, ప్రస్తుత ఎన్సీ అధ్యక్షుడు, మాజీ సీఎం ఫారూఖ్ అబ్దుల్లా కుమారుడైన 54 ఏండ్ల ఒమర్ కేంద్రపాలిత ప్రాంత ముఖ్యమంత్రిగా ఇటీవల ప్రమాణం చేశారు.%జీుఎఎబ ఖుంప్త్రఎతీ% ఎ ఒమర్ తాత షేక్ అబ్దుల్లా జమ్మూకశ్మీర్ తొలి ముఖ్యమంత్రి. షేక్ మరణానంతరం ఆయన కుమారుడు డాక్టర్ ఫారూఖ్ అబ్దుల్లా (ఇప్పు డు వయస్సు 87) కూడా తండ్రి మాదిరిగానే మూడుసార్లు కల్లోలిత కశ్మీరానికి ముఖ్యమంత్రిగా సేవలందించారు. డాక్టర్ కుమారుడు, మూడో తరం అబ్దుల్లా అయిన ఒమర్ కూడా కశ్మీర్ ప్రత్యేక హోదా కలిగిన రాష్ట్రంగా ఉన్నప్పుడు ఆరేండ్లు ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. మూడు తరాలకు చెందిన ఈ ముగ్గురు అబ్దుల్లాలు 1948 నుంచి 2015 జనవరి 8 వరకూ దాదాపు 30 ఏండ్లు ముఖ్యమంత్రి పదవిలో రాష్ట్రాన్ని దశ ల్లో పాలించారు. ఇలా ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఒక రాష్ట్రంలో పదవి చేపట్టడం ఇదే మొదటిసారి. ప్రత్యేక సామాజిక, భౌగోళి క పరిస్థితులున్న కశ్మీర్‌లో ఇది సాధ్యమైందని భావించవచ్చు. అయితే, స్వల్పంగా భూభాగం తగ్గిన నూత న కేంద్రపాలిత ప్రాంతం జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రిగా ఒమర్ ఇప్పుడు ఏ ముఖ్యమంత్రికీ లేని ప్రత్యేక సవాళ్లున్నాయి.జమ్మూకశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి (అటానమీ) లేదా ప్రత్యేక హోదా కల్పించే రాజ్యాంగ అధికరణ 370ను భారత రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా తొలగించారు. తర్వాత భారత పార్లమెంటు చట్టం ద్వారా జమ్మూకశ్మీర్, లద్దాఖ్‌ను రెండు వేర్వేరు ప్రాంతాలు గా విడదీసి కేంద్రపాలిత ప్రాంతాలుగా మార్చడంతో అక్కడ ఎన్నికలు మొదట ప్రధానాంశమైంది. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఇటీవల జమ్మూకశ్మీర్ అసెంబ్లీకి ఎన్నికలు జరిపించా రు, 90 మంది సభ్యులున్న అసెంబ్లీలో జమ్మూకశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్‌కు సొంతంగా మెజారిటీ రాకపోవడంతో కాంగ్రెస్ వెలుపలి నుంచి ఇచ్చే మద్దతుతో రాష్ట్ర మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లా నేతృత్వంలో ఎన్సీ సర్కార్ అధికారంలోకి వచ్చింది.రాష్ట్ర హోదా కోల్పోవడంతో ఇదివరకు కశ్మీర్‌కు ఉన్న శాసనమండలి (విధాన పరిషత్తు) కూడా రద్దయింది. దీంతో కశ్మీర్ మంత్రిమండలి సభ్యుల సంఖ్య తగ్గిపోవడంతో మిత్రపక్షమైన కాంగ్రెస్‌కు కోరినన్ని మంత్రి పదవులు ఇవ్వడం సాధ్యం కాదని ఒమర్ తేల్చిచెప్పారు. ఫలితం గా, హస్తం పార్టీ బయటినుంచి మద్దతు ఇవ్వాలని నిర్ణయించింది. కేంద్రపాలిత ప్రాంతంగా మారడం వల్ల ఇలా అనేక సమస్యలుతలెత్తుతున్నాయి.కేంద్రంలో కాంగ్రెస్ లేదా బీజేపీ ఏది చెలాయిస్తున్నా.. సాధారణ పరిస్థితులు ఉండే ఇతర రాష్ట్రాల్లో సైతం గవర్నర్ల పెత్తనం ఏ స్థాయిలో ఉం టుందో చూస్తూనే ఉన్నాం. ఇక జమ్మూకశ్మీర్‌లో వివాదాస్పద గవర్నర్ జగ్‌మోహన్ నుంచి పలువురు గవర్నర్లు రాష్ట్ర సర్కార్లును సతాయించినవారే. కేంద్ర ప్రభుత్వాల కనుసన్నల్లో మెలుగుతూ బీజే పీ నాయకత్వంలోని కేంద్ర సర్కార్ల ఆదేశానుసారం వారు వ్యవహరించిన తీరు ప్రజలు ఇంకా మరిచిపోలేదు. ఏదైనా కేంద్రపాలిత ప్రాంతంలో అసెంబ్లీ, ముఖ్యమంత్రి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు దాని లెఫ్టినెంట్ గవర్నర్లు ఎలా సీఎంపై పెత్తనం చేయడానికి ప్రయత్నిస్తారో గత కొన్నేండ్లుగా ఢిల్లీలో చూస్తూనే ఉన్నాం.ఆప్ నేత అరవింద్ కేజ్రీవాల్ ముఖ్యమంత్రిగా ఉండగా, ఆ తర్వాత ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్లు తమ అధికారాన్ని ఏ స్థాయిలో చెలాయించారో రుజువు చేశారు. మరి ఈ లెక్కన తీవ్రవాదం, పొరుగు దేశంతో తరచూ ఉద్రిక్తతలు నెలకొనే పరిస్థితులున్న సరిహద్దు ప్రాంతం జమ్మూ కశ్మీర్‌లో లెఫ్టినెంట్ గవర్నర్ వ్యవహారశైలిని బట్టి ఒమర్



అబ్దుల్లా పాలన ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే 370వ అధికరణ పునరుద్ధరించాలని కోరుతూ ఒమర్ అబ్దుల్లా మంత్రివర్గం అసెంబ్లీ తీర్మానం చేయించాలని నిర్ణయించింది.ఈ తీర్మానం కేంద్రపాలిత ప్రాంత శాసనసభ ఆమోదించి లెఫ్టినెంట్ గవర్నర్ ద్వారా కేంద్రానికి పం పితే అది ఎంతవరకు ఆచరణ రూపం దాల్చుతుందో ఊహించడం కష్టం కాదు. అదీగాక, జమ్మూకశ్మీర్‌కు తిరిగి రాష్ట్ర హోదా ఇవ్వడానికి కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కార్ సుముఖమే గానీ, అది ఎప్పుడు చేస్తా రో చెప్పడం కష్టం. ఇక ప్రత్యేక హోదా ప్రసాదించే 370 అధికరణ పునరుద్ధరించడానికి జాతీయ పక్షాలు రెండు అనుకూలంగా లేవు. ఇన్ని అననుకూల పరిస్థితుల మధ్య నేషనల్ కాన్ఫరెన్స్ ప్రభుత్వం సజావుగా ముందుకు సాగడానికి ఇంకా ఎన్నో సవాళు కనిపిస్తున్నాయి. 90 మంది ఎన్నికైన ఎమ్మెల్యేలు, గవర్నర్ నామినేట్ చేసిన ఐదుగురు ఎమ్మెల్యేలతో ఏర్పడిన ఈ కేంద్రపాలిత ప్రాంత అసెంబ్లీకి పరిమిత అధికారాలే ఉన్నాయి. లెజిస్లేటివ్ కౌన్సిల్ లేకపోవడంతో ముఖ్యమంత్రి ఇంకా తన క్యాబినెట్‌లోకి తొమ్మిది మందిని మాత్రమే తీసుకునే అవకాశం ఉన్నది. అయితే, ఇప్పటికే ఒమర్ తీసుకున్న కొన్ని నిర్ణయాలు ఆశావహంగా ఉ న్నాయి. హిందువుల జనాభా ఎక్కువగా ఉండి, 43 మంది సభ్యులు కలిగి ఉన్న జమ్మూ ప్రాంతం నుంచి తన పార్టీకి చెందిన హిందూ నేత సురీందర్‌సింగ్ చౌదరీని ఉప ముఖ్యమంత్రిగా ఆయన నియమించుకున్నారు.ఇంకా ముస్లింలు కూడా ఒక మోస్తరు సంఖ్యలో ఉన్న ఈ ప్రాంతానికి చెందిన సతీశ్ శర్మ, జావేద్ రాణాకు కూడా క్యాబినెట్‌లో స్థానం కల్పించి మతాలవారీగా సమతూకం పాటించే ప్రయత్నం చేశారు ఒమర్. అయితే, కశ్మీర్‌లో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా తన చెప్పుచేతుల్లో ఉండేవిధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. ఇటీవల ప్రవేశపెట్టిన జమ్మూకశ్మీర్ కేంద్రపాలిత ప్రభుత్వ పరిపాలనా నియమాలు (రెండో సవరణ) 2024 జూలై 12 ప్రకారం లెఫ్టినెంట్ గవర్నర్ అధికారాలు మరింత విస్తృతమయ్యాయి.లెఫ్టినెంట్ గవర్నర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధికారాలు అపరిమితంగా పెరుగుతూ పోయే పాల నావ్యవస్థను కశ్మీర్‌లో ఏర్పాటు చేయడానికి కేంద్ర సర్కార్ ప్రయత్నిస్తున్న క్రమంలో ఒమర్ అబ్దుల్లా సర్కారు ప్రజలకు గాని, దేశానికి గాని చేయగలిగింది పెద్దగా ఏమీ కనిపించడం లేదని రాజకీయ పండితు లు అభిప్రాయపడుతున్నారు. కశ్మీర్‌లో కుటుంబ మూలాలున్న తొలి భారత ప్రధాని పండిత నెహ్రూ దగ్గరినుంచి ఆయన మనవడు రాజీవ్‌గాంధీ వరకూ, ఇంకా పీవీ నరసింహారావు, మన్మోహన్‌సింగ్ నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు జమ్మూకశ్మీర్‌పై తమ పట్టును, నియంత్రణను పెంచుకుంటూ పోయా యే గానీ తగ్గించనే లేదు, బీజేపీ ప్రధానులు ఏబీ వాజపేయి, నరేంద్ర మోదీ సర్కార్లదీ ఇదే ధోరణి. ఈ వాస్తవాలను గుర్తించిన ఒమర్ మరి భవిష్యత్తులు జమ్మూకశ్మీర్‌కు కనీసం రాష్ట్ర హోదా సాధించి నా దాన్ని గొప్ప విజయంగా పరిగణించవచ్చు.

# విద్యుత్ ఛార్జీల పెంపు ప్రతిపాదన సరికాదు



నిజామాబాద్,రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన విద్యుత్ డిస్కంలు వివిధ కారణాలు చెప్పి18,500 కోట్ల రూపాయల విద్యుత్ భారాన్ని ప్రజలపై మోపేందుకు సిద్ధమైందని బిఆర్ఎస్ ఆరోపిస్తోంది. రూ.963 కోట్ల ట్రూ అప్ ఛార్జీలు, రూ.16,364 కోట్ల విద్యుత్ ఛార్జీలు ఈ ఆర్థిక సంవత్సరానికి గాను రూ.1,200 కోట్ల విద్యుత్ ఛార్జీల పెంపు కోసం విద్యుత్ సంస్థలు పిటిషన్లు దాఖలు చేశాయి. వాటిని వెంటనే తిరస్కరించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. విద్యుత్ ఛార్జీల పెంపు ప్రతిపాదనలపై విద్యుత్తు నియంత్రణ మండలి గురువారం నిజామాబాద్ కలెక్టరేట్ చేపట్టిన బహిరంగ విచారణలో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్, విజి గౌడ్ తదితరులు పాల్గొని కమిషన్ సభ్యుల ముందు తమ వాదనలు వినిపించారు. ఈ వసందర్భంగా ఎమ్మెల్యే వేముల మాట్లాడుతూ..ఇళ్లకు వాడుకునే కరెంటు నెలకు 300 యూనిట్లు దాటితే కిలోవాట్‌కు ఫిక్సుడు ఛార్జీని ప్రస్తుతం రూ.10 వసూలు చేస్తుండగా దాన్ని రూ.50 కి పెంచాలని డిస్కంలు కోరటం సరికాదన్నారు. ఇటీవల కాలంలో విద్యుత్ వినియోగం అనేది చాలా పెరిగిపోయింది. ఎండాకాలం వచ్చిందంటే చాలు 300యూనిట్ల విద్యు త్ వినియోగం సాధారణమైందని పేర్కొన్నారు. ఇది ప్రజలపై పెను భారం మోపుతుంది. వారిని ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. 300 యూనిట్లు పై వాడే మధ్య తరగతి ప్రజలకు దీనివల్ల ప్రతి నెల వేల రూపాయల భారం పడుతుంది. ఇంత పెద్ద ఎత్తున విద్యుత్ ఛార్జీలు పెంచాలని ప్రతిపాదించటం సమంజసం కాదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో సవాళ్లు ఎదుర్కొని ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించిందని గుర్తు చేశారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం విద్యుత్ కేవలం ఒక వ్యాపార వస్తువుగా చూడటం దురదృష్టకరమన్నారు. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని నిర్ణయాలు తీసుకోవాలన్నారు.చిన్న పరిశ్రమలకు, భారీ పరిశ్రమలకు ఇచ్చే కరెంట్ కు ఒకే విధమైన రేటు కట్టటమంటే ఒక విధంగా సూక్ష్మ, చిన్న, మధ్య తరగతి పరిశ్రమలకు ఉరి వేస్తున్నట్లేనని అన్నారు. నిర్ణయం కారణంగా రాష్ట్రంలో ఉన్న ఎస్ఎంఎస్ఈ మొత్తం రోడ్డున పడే పరిస్థితి వస్తుంది. దాంతో లక్షల మంది ఉపాధి కోల్పోతారు.పరిశ్రమ లన్నిం టినీ ఒకే గాటున కట్టాలని భావించటం దుర్మా ర్గం. దీని కారణంగా సిరిసిల్ల, కాటేదాన్ సహా చాలా ప్రాంతాల్లో ప్రభుత్వం ఇచ్చే విద్యుత్ సబ్సిడీలు బంద్ అయ్యే పరిస్థితి ఉంటుంది దీంతో వేలాది మంది ఉపాధి పై ప్రభావం చూపుతుందని అన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ అసంబద్ధ నిర్ణయాలతో పారిశ్రామిక రంగంలో మందగమనం మొదలైంది. చాలా కంపెనీలు రాష్ట్రాన్ని వీడి వెళ్తున్నాయి. ఫాక్స్ కాన్ లాంటి సంస్థ తన కంపెనీ విస్తరణను విరమించుకుంది. లాంటి పరిస్థితుల్లో పరిశ్రమలను కాపాడుకోవటానికి వీలైనంత వరకు వారికి ప్రోత్సహకాలు ఇవ్వాలి. కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న పరిశ్రమలు కూడా ఆగమయ్యే విధంగా విద్యుత్ ఛార్జీలను పెంచాలని ప్రయత్నిస్తోంది. ఉచిత విద్యుత్ భారాన్ని మధ్యతరగతి, చిన్న పరిశ్రమలు, భారీ పరిశ్రమలపై వేయాలని ఆలోచిస్తోంది. వారి ఆనాలోచిత నిర్ణయాల కారణంగా మొత్తం రాష్ట్ర అభివృద్ధి కుంటు పడే ప్రమాదం ఉంది. డిస్కంలు ప్రతిపాదించిన 9 ప్రతిపాదనలను తిరస్కరించాలి. డిస్కంలు చేస్తున్న ప్రతిపాదనల వెనుక ఖచ్చితంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వమే డిస్కంల పేరుతో ప్రజల నడ్డి విరిచేందుకు దొడ్డి దారిలో ప్రయత్నాలు చేస్తోందన్నారు. నిజానికి ఈ కాంగ్రెస్ పార్టీ ప్రజలకు 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ అంటూ అధికారంలోకి వచ్చింది. ఎప్పుడు దాన్ని ఎలా అమలు చేయాలో తెలియక అసంబద్ధ నిర్ణయాలు తీసుకొంటోంది. ట్రూ అప్ ఛార్జీలు, తక్షణం విద్యుత్ ఛార్జీల పెంపు అంటూ కాంగ్రెస్ పార్టీ ప్రజలపై భారాన్ని మోపేందుకు తొందరపడుతోంది. కనుక ఇప్పుడున్న పరిస్థితుల్లో ఎట్టి పరిస్థితుల్లో విద్యుత్ ఛార్జీల పెంపు అనేది రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తుంది. ఇప్పటికే ఈ ప్రభుత్వం విద్యుత్ సరఫరా లో వైఫల్యం చెందటంతో ప్రజలు, రైతాంగం విసిగిపోయి ఉన్నారు. ఇ÷ుద్యుత్ ఛార్జీల పెంపు ద్వారా జరిగే అనర్థాలను పరిగణలోకి తీసుకోకుండా ఈ ప్రభుత్వం మూర్ఖంగా వ్యవహరిస్తోంది.విద్యుత్ ను ప్రజల జీవనాడిగా ఉన్న ఒక ప్రాథమిక హక్కు గా భావించినప్పుడే ప్రజల జీవితాల్లో వెలుగులు నిండుతాయి. రాష్ట్రం ఏర్పడితే తెలంగాణ అంధకారం అవుతుందన్న విమర్శలకు దేశంలో ఎక్కడ లేని విధంగా 24 గంటల కరెంట్ ఇచ్చి అవన్నీ తప్పుడు ఆరోపణలని నిరూపించారు. ÷ూష్ట్ర రైతాంగానికి 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్తు నుంచి మొదలుకొని పారిశ్రామిక రంగానికి 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేశాం. క్రమంలో కేసీఆర్ గారు విద్యుత్ రంగంలో ఎన్నో అవరోధాలను ఎదుర్కొని విజయాలు సాధించారు. రాష్ట్రం ఏర్పడినప్పుడు 7 వేల మెగావాట్లు మాత్రమే ఉన్న విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 24 వేల మెగావాట్లకు తీసుకెళ్లారు. ÷ూణ్యమైన విద్యుత్ అందించేందుకు ట్రాన్ ఫార్మర్లు, విద్యుత్ లైన్లను ఆధునీకరించారు. మొత్తం విద్యుత్ రంగంలోనే సమూలమైన మార్పులు తెచ్చారు. క్రమంలో ఎంత ఖర్చైనా వెనుకడలేదు. పైగా ప్రజలపై భారం అసలే మోపలేదు. కేసీఆర్ ప్రభుత్వంలో కూడా డిస్కంలు విద్యుత్ ఛార్జీల పెంపును ప్రతిపాదిం చాయి కానీ ఆయన అందుకు ససేమిరా అన్నారు.ట్రూ అప్ ఛార్జీల పెంపునకు కూడా అనుమతి ఇవ్వకుండా దాదాపు 1200 కోట్ల భారాన్ని ప్రభుత్వమే భరించింది.విద్యుత్ అనేది రాష్ట్ర ప్రగతికి ఇంజన్ లాంటిదని ఆయన భావించారు కనుకే విద్యుత్ ఛార్జీల భారాన్ని ప్రజలపై మోపలేదు. దాని ఫలితాలు ఇవ్వాళ తెలంగాణలో కనిపిస్తున్నాయి రైతులకు ఉచిత విద్యుత్ సరఫరా కారణంగా రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తి నాలుగు రెట్లు పెరిగింది. పరిశ్రమలు, (ఎస్ఎంఎస్ఈ) లకు 24 గంటలు

# కొత్త రైల్వేలైన్ తో అమరావతి అనుసంధానం

అమరావతి,అమరావతికి రైల్వేలైన్ మంజూరు చేసిన ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. అశ్వినీ వైష్ణవ్ నిర్వహించిన మీడియా సమావేశంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఏపీ భాజపా అధ్యక్షురాలు పురంధేశ్వరి వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. కొత్త రైల్వేలైన్ ఏర్పాటుతో అమరావతి దేశంలోని ఇతర ప్రాంతాలతో అనుసంధానం కానుందన్నారు. విశాఖ రైల్వే జోన్ అంశం దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉ ందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. భూసేకరణ సహా ఇతర అంశాల్లో రాష్ట్ర సహకారం ఉంటుందని స్పష్టం చేశారు.రూ.45,300 కోట్లతో నాలుగు గ్రీన్‌ఫీల్డ్ రహదారుల నిర్మాణం జరగనుందని, 6 ప్రాజెక్టులు బిడ్డింగ్ దశలో ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. 15 ప్రాజెక్టులు నిలిచిపోయాయని, 75 ప్రాజెక్టులకు భూసేకరణ సమస్యలు, 23 ప్రాజెక్టులకు అటవీ అనుమతుల సమస్యలు ఉన్నాయన్నారు. మొత్తం 95 ప్రాజెక్టులకు వివిధ సమస్యలు ఉన్నాయని వివరించారు. రాష్ట్రంలో చేపట్టబోయే ప్రాజెక్టులన్నింటికీ 3 నెలల్లో భూసేకరణ పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. బెంగళూరు-కడప-విజయవాడ ఎక్స్‌ప్రెస్ వేకు సమస్యలు ఉన్నాయన్నారు. ఈ ప్రాజెక్టుకు 15 రోజుల్లో పర్యావరణ అనుమతులు సాధించా లన్నారు. నిర్ణీత కాలవ్యవధిలో పనులు పూర్తి చేయాలని ఆదేశించినట్లు చెప్పారు. దాదాపు రూ.18 వేల కోట్లతో పనులన్నీ పూర్తి చేయనున్నట్లు చెప్పారు. రెండున్నరేళ్లలో రూ.50 వేల కోట్లతో పనులు పూర్తి చేయాల్సి ఉందన్నారు. హైదరాబాద్ నుంచి మచిలీపట్నానికి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణం జరగ నుందన్నారు. ఎకో గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా ఏపీ మారనుందని తెలిపారు. ఆక్వా, హార్టికల్చర్ ఎగుమతులకు అవకాశాలు ఉ న్నాయని చంద్రబాబు వివరించారు. ఆంధ్రప్రదేశ్‌కు చరిత్రాత్మక రోజు అని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు అభివర్ణించారు. ఎన్డీయే ప్రభుత్వంపై ప్రజలకు పూర్తి నమ్మకం ఉందన్నారు. రాజధాని నుంచి ఏ ప్రాంతానికైనా అనుసంధానం చాలా కీలకమన్నారు. పది రోజుల స్వల్ప వ్యవధిలోనే కొత్త రైల్వే లైన్ ప్రతిపాదనలు కేబినెట్ ముందుకు తెచ్చారని చెప్పారు. మల్టీ మోడల్ లాజిస్టిక్ హబ్‌గా పరిటాల మారనుందని కేంద్ర రైల్వేశాఖమంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. పరిటాల వద్ద మల్టీ మోడల్ కార్గో టెర్మినల్ వస్తుందని వెల్లడించారు. ఏపీలో 73 రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. 160కి.మీ వేగంతో వెళ్లేలా సెమి హైస్పీడ్ రైల్వేలైన్ల నిర్మాణం. మొత్తం మూడు కారిడార్లను అప్‌గ్రేడ్ చేస్తున్నాం. అమరావతి-హైదరాబాద్, అమరావతి- చెన్నై కారిడార్ల అభివృద్ధి. అమరావతి బెంగళూరు కారిడార్ అప్‌గ్రేడ్ చేస్తున్నాం. రైల్వే లైన్ ద్వారా అమరావతికి ప్రత్యక్ష అనుసంధానం ఉంటుంది. పరిశ్రమల స్థాపన, ప్రజా రవాణాకు మెరుగైన వ్యవస్థలా ఉ ంటుంది. బహుళ ట్రాకింగ్ సులభతరంతో పాటు రద్దీని తగ్గిస్తుందని కేంద్ర మంత్రి వివరించారు. అలాగే రాష్ట్రంలో రహదారుల అభివృద్ధికి కేంద్ర రూ.252.42 కోట్లు మంజూరు చేసింది. శ్రీకాకుళం జిల్లా రణస్థలం వద్ద ఆరువరుసల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం చేపట్టనున్నారు. ఈ కారిడార్ నిర్మాణానికి కేంద్రం నిధులు మంజూరు చేసిందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ 'ఎక్స్'లో పోస్టు చేశారు.

# ఇన్ని లక్షల కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయి

అమరావతి,వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మరోసారి ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు తీవ్ర విమర్శలు గుప్పించారు. తండ్రి సంపాదించిన ఆస్తి ఆయన భార్యకు రాదా అని ప్రశ్నించారు. 2004లో జగన్ ఆదాయం ఎంత..ఇవన్నీ ఎక్కడినుంచి వచ్చాయి ఈ లక్షల కోట్లు అని నిలదీశారు. ఇలాంటి వారితో రాజకీయం చేయలంటే సిగ్గుగా ఉందని విమర్శించారు. వంకర రాజకీయాలు, చిల్లర రాజకీయాలు ఇకనైనా మానుకోవాలని హితవు పలికారు. విలువలు లేని మనుషులు సమాజానికి చేటని విమర్శలు చేశారు. ప్రభుత్వంలో ఉండగా ఎప్పుడైనా ఇచ్చారా ప్రజలను ఆదుకున్నారా అని అడిగారు.. ఇప్పుడేమో రూ. 10లక్షలు ఇచ్చే శక్తి ఇప్పుడు వచ్చిందా అని ప్రశ్నించారు. జగన్ దగ్గర ఉన్న డబ్బు ప్రజలకు ఇవ్వాలని.. అలా అయినా అవినీతి డబ్బు ప్రజలకు చేరుతుందని అన్నారు. ఐదేళ్లు ఇంట్లో నుంచి తనను బయటకు రానివ్వలేదని మండిపడ్డారు. ఇప్పుడు తిడుతున్నారుగా వారిని ఆపాలంటే ఎంత సేపు ఒక్కనిముషమని వార్నింగ్ ఇచ్చారు. విలువలు లేని రాజకీయం చేసి అందులో హీరోయిజం చేయాలనుకుంటే ఇక కలేనని విమర్శించారు..ఆస్తిలో వాటా ఇవ్వనంటూ తల్లి, చెల్లిని జగన్ రోడ్డుపైకి లాగారు. మమ్మల్ని నిందిస్తూ జగన్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. జగన్ లాంటి వ్యక్తులతో రాజకీయాలు చేస్తాననుకోలేదు. ఆస్తిలో వాటా ఇవ్వాలంటే జగన్‌ను విమర్శించకూడదని షరతు పెట్టారు. ఇలాంటి వారితో రాజకీయం చేయాలంటే సిగ్గనిపిస్తోంది. వైకాపాలో ఉన్నామని చెప్పుకొనేందుకు ఆ పార్టీ నేతలు సిగ్గుపడుతున్నారు. జగన్ ప్రభుత్వం దాచిపెట్టిన చీకటి జీవోలపై విచారణ జరిపిస్తాం. చీకటి జీవోల్లోని అక్రమాలు నిగ్గుతేల్చి గత తప్పిదాలు సరిదిద్దుతాం' అని సీఎం తెలిపారు.

### ఆస్తులపై ప్రేమతో బంధాలు..అనుబంధాలు మార్చారు

అమరావతి,చెల్లిపై ప్రేమతో జగన్ షేర్లు బదిలీ చేశారనేది పచ్చి అబద్ధమని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. జగన్ బెయిల్ రద్దుకు కుట్ర అనడం శతాబ్దపు పెద్ద జోక్ అని వ్యాఖ్యానించారు. ఆస్తుల వ్యవహారంలో ఆమె.. జగన్‌కు పలు ప్రశ్నలు సంధించారు. ఆస్తులపై ప్రేమతో రక్త సంబంధం, అనుబంధాలను మార్చారు. కుటుంబ విషయాలను రోడ్డు మీదకు తీసుకువచ్చారు. అది చాలదన్నట్లు ఇప్పుడు కోర్టుల వరకు తీసుకెళ్లారు. ఆస్తులను లాక్కోవడానికి కారణంగా చెబుతున్నారు కానీ వాస్తవం కాదు. ఈడీ కేసులు, బెయిల్ రద్దవుతుందని కారణాలు చెబుతున్నారు. సరస్వతి కంపెనీ షేర్లను ఈడీ అటాచ్ చేయలేదు. రూ.32 కోట్ల విలువైన కంపెనీ భూమిని ఈడీ అటాచ్ చేసింది. కంపెనీ షేర్లను ఎప్పుడూ ఈడీ అటాచ్ చేయలేదు. ఏ సమయంలోనైనా షేర్లను బదిలీ చేసుకోవచ్చు. ఏ కంపెనీ ఆస్తులనైనా ఈడీ అటాచ్ చేసినా.. షేర్ల బదిలీని ఆపలేదు. 2016లో ఈడీ అటాచ్ చేసినందున షేర్ల బదిలీ చేయకూడదని జగన్ వాదిస్తున్నారు. షేర్లు బదిలీ చేస్తే బెయిల్ రద్దవుతుందని వాదిస్తున్నారు. 2019లో 100శాతం వాటాలు బదలాయిస్తామని ఎంవోయూపై సంతకం ఎలా చేశారు. అప్పుడు మీ బెయిల్ సంగతి గుర్తుకు రాలేదా? 2021లో క్లాసిక్, సండూరు షేర్ల కొనుగోలుకు ఎలా అనుమతి ఇచ్చారు? షేర్లను రూ.42 కోట్లకు కొనుగోలుకు తల్లికి ఎలా అనుమతి ఇచ్చారు? అప్పుడు మీ బెయిల్ సంగతి గుర్తుకు రాలేదా? 2021లో జగన్, అతని భార్య షేర్లను తల్లి గిఫ్ట్‌డీడ్ ఎలా ఇచ్చారు? అని షర్మిల ప్రశ్నించారు. ఇటీవల జగన్ ఓడాక ఈ ప్రాజెక్టును వదులుకోవడం ఇష్టం లేదు. భారతి సిమెంట్స్ బ్యానర్ కింద సరస్వతి సిమెంట్ చేపట్టాలని

# రాహుల్ ఆలోచనలకు భిన్నంగా రాష్ట్ర కాంగ్రెస్



హైదరాబాద్,కేసీఆర్‌లాగే కాంగ్రెస్.. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడం పట్ల ప్రజలు ఆశ్చర్యానికి గురవుతున్నారని అంటూ ఏఐసిసికి రాసిన లేఖలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పేర్కొన్నారు. రాహుల్ గాంధీ ఆలోచనలకు భిన్నంగా పార్టీ నడుస్తోందని తెలిపారు. పార్టీ ఫిరాయించిన వారికి ప్రత్యేక గుర్తింపు ఇవ్వబడుతుందనే అభిప్రాయాన్ని కల్గించే విధంగా పార్టీ వ్యవహారం ఉన్నట్లు పేర్కొన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలతో పోచారం ఇంట్లో సమావేశం నిర్వహించడాన్ని ఎమ్మెల్సీ తీవ్రంగా తప్పుబట్టారు. ముఖ్య అనుచరుడి హత్యతో తీవ్ర మనోవేదనకు గురైనఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీపై కూడా అసహనాన్ని వ్యక్తం చేస్తూ పలు వ్యాఖ్యలు చేశారు. తాజాగా పార్టీలో కొనసాగుతున్న పరిణామాలను జీర్ణించుకోలేక తీవ్ర మానసిక వ్యధతో ఏఐసీసీ చీఫ్‌కు జీవన్ రెడ్డి లేఖ రాశారు. అంతేకాకుండా కాంగ్రెస్ పార్టీ గురించి లేఖలో సంచలన వ్యాఖ్యలు చేశారు. నేను నమ్ముకున్న కాంగ్రెస్ పార్టీ నన్ను అగౌరవంగా, అవమానంగా చూస్తోంది. నా భవిష్యత్తు కార్యాచరణ పార్టీనే మార్గదర్శకం చేయాలి. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలతో పాటు సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి , పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌లకు ఎమ్మెల్సీ లేఖ రాశారు. కాంగ్రెస్‌లో తనకు జరుగుతున్న అన్యాయం, పరిణామాలను వివరిస్తూ ఎమ్మెల్సీ లేఖ రాశారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యే సంజయ్ అనుచరుడిగా భావించే సంతోష్ కాంగ్రెస్ పార్టీ నాయకుడిని హత్య చేశాడని వెల్లడించారు. పదేండ్లు అనేక దౌర్జన్యాలను ఎదుర్కున్నామని.. కాంగ్రెస్ ముసుగు కప్పుకొని మళ్ళీ దౌర్జన్యాలు చేస్తామంటే ఎలా భరించాలని అడిగారు. పార్టీని కన్నతల్లి అనుకున్నానని.. పార్టీ తనకు అనేక అవకాశాలు ఇచ్చిందని చెప్పుకొచ్చారు. కేసీఆర్‌పై పోటీ చేయమంటే చేశానన్నారు. నన్ను ప్రతిపక్షాలు ఏకాకిని చేసి హేళన చేసినా తట్టుకొని నిలబడ్డాను. పార్టీ అధిష్ఠానం నా గౌరవాన్ని కాపాడతానని నోటిమాటగా చెప్పింది. పార్టీ ఫిరాయింపులకు ముఠా నాయకుడు ఉన్నాడు. పార్టీ ఫిరాయింపులకు ముఠా నాయకుడు పోచారం శ్రీనివాస్ రెడ్డి. పది మంది ఎమ్మెల్యేలు లేకపోతే ప్రభుత్వం కొనసాగాదా.. రాహుల్ ఏం చెప్తున్నాడు. మనం ఏం చేస్తున్నాం. మా పార్టీ నాయకుడు గంగారెడ్డిని చంపిన వ్యక్తి బీఆర్ఎస్ తరపున ఎన్నికల్లో డబ్బులు పంచారు. గంగారెడ్డిని చంపిన సంతోష్‌పై అనేక క్రిమినల్ కేసులు ఉన్నాయి. గంగారెడ్డిని మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నేను ప్రపోజ్ చేశారు. ఎవరి అండదండలు చూసుకొని సంతోష్ మా నాయకుడిని చంపాడు అంటూ ఆయన ప్రశ్నలు కురిపించారు. అలాగే జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌పై కూడా జీవన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'కాంగ్రెస్ పార్టీ పుట్టిందే మా ఇంట్లో అంటున్నాడు. మీ ఇంట్లో కాంగ్రెస్ పార్టీ పుడితే పరాయి ఇంటికి ఎందుకు వెళ్ళాడు. సంజయ్ ఎప్పుడైనా కాంగ్రెస్ పార్టీకి ఓటేశాడా.. నేను రాజీవ్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీలో చేరాను. సంజయ్ చొక్కారావు మనవడిని అని చెప్పుకుంటున్నారు. ఇందిరా గాంధీ కష్టకాలంలో ఉన్నప్పుడు చొక్కారావు జనతా పార్టీలో చేరాడు. సంజయ్ టీఆర్ఎస్‌లో ఎన్నడూ లేడు. అక్కడి ఉద్యమ నాయకుల మధ్య సమన్వయ లోపం వల్ల సంజయ్ తెరపైకి వచ్చాడు. అభివృద్ధి జరగాలంటే అధికార పార్టీలో చేరతామంటే ప్రజాస్వామ్యం ఉంటుందా. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిన కేసీఆర్ పరిస్థితి ఏమయిందని అంటూ వ్యాఖ్యలు చేశారు. అలాగే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పైనా ఎమ్మెల్సీ విరుచుకుపడ్డారు. భట్టికి ప్రతిపక్ష నేత హోదా పోవడానికి కారణం పోచారమన్నారు. పోచారం లాంటి వాడిని పార్టీలో చేర్చుకోవడం ఏంటి? పోచారం సలహాదారుడు ఏంటి. పార్టీ ఫిరాయింపుల క్రమబద్ధీకరణ విషయంలో పోచారం సలహాలు ఇవ్వగలడు అంటూ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు.నేను నిద్రలేని రాత్రులు గడుపుతున్నాను. పార్టీని వదిలి వెళ్ళాలనే ఆలోచన చేయలేకపోతున్న. అవమానాలు భరించుకుంటూ ఉండాలా? రేవంత్ మా నాయకుడు. ఆయన్ని తప్పకుండా కలుస్తాను. కాంగ్రెస్ కార్యకర్తల ఆవేదన మా వ్యక్తిగతం అని పీసీసీ చీఫ్ భావిస్తే నేనేం చేయగలను. పార్టీ పట్ల గౌరవం లేకనే నేను ఇక్కడి దాకా వచ్చానా.. ఇప్పటికీ నాకు పార్టీపై గౌరవం ఉంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది. రేవంత్ నాయకత్వంలో ప్రభుత్వం సమర్థవంతంగా పని చేస్తోంది. నేను రాజకీయం చేయడం లేదు. సంజయ్ భుజాలు తడుముకుంటున్నాడు. మా పార్టీ నాయకుడిని చంపిన నిందితుడు సంజయ్ అనుచరుడు కాదని చెప్పగలరా.. సంజయ్ ఏ పార్టీలో ఉన్నాడో ఆయనకి క్లారిటీ లేదా.. దానం నాగేందర్‌కు ఎంపీ టికెట్ ఇవ్వడాన్ని సమర్థించడం లేదు. నేను ఎప్పుడూ పార్టీ ఫిరాయించలేదు. నాకు నేనుగా మంత్రి పదవికి రాజీనామా చేశారు. పదేండ్లలో నేను పార్టీని నిలబెట్టాను. రాహుల్ ప్రధాని కావాల్సిందే. నామినేటెడ్ పదవులు మాకు ఇవ్వాలి. పార్టీలో మాదే ఆధిపత్యం ఉండాలి అంటే ఎలా. పార్టీ ఫిరాయించి ముసుగేసుకొని దౌర్జన్యం చేయడం బ్లాక్ మెయిల్ కాదా. నా మానసిక పరిస్థితి అర్థం చేసుకోండి. పార్టీ ఫిరాయింపులు జరిగాయో లేదో క్లారిటీ లేకుండా పోతుంది. నేను పార్టీకి అంతర్గతంగా లేఖ రాశాను. ఆవేదన భరించలేక బయటకి చెప్పుకుంటున్నానని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి లేఖలో పేర్కొన్నారు.

# కెనడా ప్రధాని ట్రుడోపై అసంతృప్తి జ్వాల



న్యూఢిల్లీ,కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడోపై స్వపక్షంలోనే అసంతృప్తి భగ్గుమంది. ఆయన తీసుకుంటున్న నిర్ణయాలు, ప్రకటనలు దేశంలో తీవ్ర అసంతృప్తిని కలుగ చేస్తున్నాయి. ముఖ్యంగా భారత్ వ్యతిరేక వైఖరి పట్ల తీవ్ర వ్యతిరేకత వస్తోంది. అందుకే ఆయన రాజీనామా చేయాలని 24 మంది లిబరల్ సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం ఆ పార్టీ ఓ క్లోజ్డ్‌డోర్ సమావేశం నిర్వహించింది. ఈ ఏడాది జూన్, సెప్టెంబర్‌లో జరిగిన ఎన్నికల్లో తీవ్రంగా దెబ్బతినడానికి ప్రధాని ట్రూడో వైఖరే కారణమని అందులో సభ్యులు అసంతృప్తి వ్యక్తంచేశారు. దీనిపై ట్రూడో సన్నిహితుడిగా పేరున్న ఇమిగ్రేషన్ మంత్రి మార్క్ మిల్లర్ మాట్లాడుతూ ఇది చాలా రోజులుగా నలుగుతున్న విషయం. ప్రజలు దీనిని బయటపెట్టడం అవసరం. ఎన్నికల్లో ఏం జరిగింది అనే విషయాన్ని ఎంపీలు నిజాయతీగా ప్రధానికి వెల్లడించారు. ఆయనకు వినడం ఇష్టం ఉన్నా లేకపోయినా వారు మాత్రం చెప్పేశారని రిపోర్టర్ల వద్ద వ్యాఖ్యానించారు. ట్రూడో రాజీనామా చేయాలన్న లేఖపై మొత్తం 153 మంది ఎంపీల్లో 24 మంది సంతకాలు చేశారని కెనడా బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ వెల్లడించింది. అక్టోబర్ 28 వరకు డెడ్‌లైన్ విధించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే మైనార్టీలో ఉన్న ప్రభుత్వానికి ఇది మరింత సవాలుగా మారనుంది. జూన్, సెప్టెంబర్ ఎన్నికల్లో లిబరల్స్ బలమైన రెండు స్థానాలను కోల్పోయారు. అంతేకాదు.. పార్టీ వచ్చే ఎన్నికలకు చేసే సన్నాహాలు కూడా దారుణంగా ఉన్నాయని ఎంపీలు అభిప్రాయపడ్డారు. పార్టీ ఎంపీ ఎరిస్కిన్ స్మిత్ మాట్లాడుతూ పరిస్థితులను చక్కదిద్దడానికి ట్రూడోకు ఇంకా సమయం ఉందని వ్యాఖ్యానించారు. మీ సహచరులు అసంతృప్తి వ్యక్తంచేసినప్పుడు దానిని వినడం చాలా ముఖ్యమన్నారు. ఈ సమావేశ సమయంలో ట్రూడో విలేకర్లతో మాట్లాడుతూ తాము బలంగా, సమష్టిగా ఉన్నామని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికలకు తానే నాయకత్వం వహిస్తానని వెల్లడించారు. చాలాకాలం లిబరల్స్‌తో కలిసి ప్రభుత్వాన్ని నడిపిన ఎన్‌డీపీ కూడా ఈసారి బ్రిటిష్ కొలంబియా ఎన్నికల్లో తీవ్రంగా దెబ్బతింది. అక్కడ కన్జర్వేటివ్ పార్టీ ఎవరూ ఊహించని స్థాయిలో బలపడింది. ఇటీవల నానోస్ రీసెర్చ్ సర్వేలో అక్టోబర్ 15 నాటికి ప్రజల్లో 39శాతం మద్దతు కన్జర్వేటివ్‌లకు ఉండగా.. లిబరల్స్‌కు కేవలం 23శాతం మాత్రమే ఉన్నట్లు వెల్లడైంది. ఇక న్యూడెమోక్రాట్స్‌కు 21శాతం మంది సానుకూలంగా ఉన్నట్లు తేలింది. ఖలిస్థానీ మద్దతుదారులను లక్ష్యంగా చేసుకొని భారత ప్రభుత్వ ఏజెంట్లు పనిచేస్తున్నారని, వారికి లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగులతో సంబంధాలున్నాయని కెనడా ఆరోపిస్తోంది. ఈ ఆరోపణలకు సంబంధించి కేవలం తమవద్ద గతంలో నిఘా సమాచారం మాత్రమే ఉందని ప్రధాని జస్టిన్ ట్రూడో ఇటీవల అంగీకరించారు. ఈ ఆరోపణలతో ఇరుదేశాల మధ్య సంబంధాలు తీవ్రస్థాయిలో దెబ్బతిన్నాయి. ఇదిలావుంటే వలసల నియంత్రణకు కెనడా ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. తమ దేశంలోకి అనుమతించే వలసదారుల సంఖ్యను భారీగా తగ్గించేందుకు సిద్ధమైంది. మరోసారి అధికారంలోకి రావాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు అక్కడి వార్తాపత్రికల్లో కథనాలు వెలువడ్డాయి. ఈ కథనాల ప్రకారం.. 2024లో 4,85,000 మందిని శాశ్వత నివాసితులుగా కెనడా గుర్తించింది. అయితే, 2025లో ఈ సంఖ్య 3,80,000లకు మాత్రమే పరిమితం చేసింది. 2027 నాటికి 3,65,000 మందికి మాత్రమే ప్రవేశం కల్పించాలని ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు. 'కెనడాలో తాత్కాలిక విదేశీ ఉద్యోగుల సంఖ్యను తగ్గిస్తున్నాం. కంపెనీలకు సంబంధించి కొన్ని కఠిన నిబంధనలు తీసుకురానున్నాం. నియామకాల విషయంలో కంపెనీలు స్థానికులకు ఎందుకు ప్రాధాన్యత ఇవ్వలేదో వెల్లడించాల్సి ఉంటుంది' అని ఆయన పేర్కొన్నారు. వచ్చే ఏడాది కెనడాలో ఎన్నికలు జరగనున్నాయి. ఈక్రమంలో చేపట్టిన సర్వేల్లో ట్రూడో నేతృత్వంలోని లిబరల్ ప్రభుత్వం వెనకంజలో ఉంది. వలసల కారణంగా నిరుద్యోగం పెరిగి పోతుండటంతో పాటు, దేశీయంగా ఇళ్ల కొరత విపరీతంగా ఉంది. దీంతో అధికార ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. అందులోభాగంగా ఇటీవల విదేశీ విద్యార్థులకు స్టడీ పర్మిట్లు, వర్కర్లకు పని అనుమతులపై మరిన్ని ఆంక్షలు తీసుకురానున్నట్లు ప్రకటించింది. తాజాగా వలసదారుల సంఖ్యను తగ్గించేందుకు నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.

# కోస్టల్ రెగ్యులేషన్ జోన్‌లో నిర్మాణాలు




అమరావతి,విశాఖ జిల్లా భీమిలిపట్నం పరిధిలో కోస్టల్ రెగ్యులేషన్ జోన్‌లో నిబంధనలు ఉల్లంఘించి నిర్మాణాలు చేపట్టిన వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డి కుమార్తె నెహారెడ్డి ఇతర బాధ్యులపై ఏం చర్యలు తీసుకున్నారని గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను ఏపీ హైకోర్టు ప్రశ్నించింది. ఇక ఈ వ్యవహారంపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారా.. అని ఆరా తీసింది. వివరాలతో నివేదిక సమర్పించాలని న్యాయస్థానం ఆదేశించింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. భీమిలి బీచ్ వద్ద సీఆర్‌జడ్ ప్రాంతంలో సముద్రానికి అతి సమీపంలో శాశ్వత కాంక్రిట్ నిర్మాణం చేపడుతున్నా.. అధికారులు పట్టించుకోవడంలేదని జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ ప్రజాప్రయోజన వాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై గురువారం విచారణ జరిపిన ధర్మాసనం సముద్రానికి అతి సమీపంలో చేపట్టిన శాశ్వత నిర్మాణాలను తొలగించాలని జీవీఎంసీని ఆదేశించింది. ఈ వ్యాజ్యం నిన్న మరోసారి విచారణకు రాగా పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది కేఎస్ మూర్తి వాదనలు వినిపించారు. కాగా వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి కూతురు నేహారెడ్డి భీమిలి బీచ్ వద్ద సీఆర్‌జడ్ నిబంధనలను ఉల్లంఘిస్తూ ప్రహరీ నిర్మాణాన్ని చేపట్టారు. నేహా రెడ్డి సీఆర్‌జడ్ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ హైకోర్టులో పిల్ కూడా దాఖలు చేశారు. బీచ్‌లో కాంక్రీట్ నిర్మాణాలను అనుమతించవద్దని అధికారులకు హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. నేహా రెడ్డికి సెప్టెంబర్ 2న జీవీఎంసీ నోటీసులు జారీ చేసింది. 24 గంటల్లో ఆక్రమణలు తొలగించాలని.. లేదంటే తామే తొలగిస్తామని హెచ్చరించింది. ఈ క్రమంలో అక్రమ నిర్మాణాలు కూల్చివేసేందుకు జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకున్నారు. విశాఖ జిల్లా భీమిలి బీచ్ వద్ద సముద్రానికి అతి సమీపంలో సీఆర్‌జడ్ నిబంధనలను ఉల్లంఘించి నేహారెడ్డి కాంక్రీట్ గోడను నిర్మించారు. దీనిపై చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ అధికారులకు ఇప్పటికే హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. భీమిలి బీచ్ సమీపంలో శాశ్వత నిర్మాణాలపై జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ పిల్ వేశారు. దీనిపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ చీమలపాటి రవిలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. కూల్చివేత విషయంలో ఎలాంటి చర్యలు తీసుకున్నారో వివరిస్తూ స్థాయి నివేదికను సమర్పించాలని గత నెలలో హైకోర్టు నిర్దేశిరచి ఆపై తదుపరి విచారణను సెప్టెంబరు 11వ తేదీకి వాయిదా వేసింది. భీమిలి బీచ్ సమీపంలో శాశ్వత నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ తరపున న్యాయవాది పొన్నాడ శ్రీవ్యాస్ వాదనలు వినిపించారు.

# తమిళనాట దీపావళికి సొంతూళ్లకు జనం

చెన్నై,దీపావళి పండుగ సందర్భంగా చెన్నై నగరం నుంచి సుమారు 10 లక్షల మంది సొంతూళ్లకు వెళ్లే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో వారికి రవాణా సదుపాయాలు కల్పించేందుకు నానా పాట్లు పడుతున్నారు. రద్దీకి అనుగుణంగా 11,000 ప్రభుత్వ బస్సులు, 10కి పైగా ప్రత్యేక రైళ్లను ఏర్పాటుచేశారు. ఈ నెల 31 దీపావళి నేపథ్యంలో చెన్నై, కోవై సహా పలు నగరాల్లో నివసిస్తున్నవారు పండుగ జరుపుకొనేందుకు తమ స్వగ్రామాలకు వెళ్లనున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు, ప్రత్యేక రైళ్లు నడపనున్నారు. నగరం నుంచి ప్రతిరోజూ నడిపే 2,092 బస్సులతో పాటు అదనంగా 4,900 ప్రత్యేక బస్సులు కలిపి, మూడు రోజుల్లో మొత్తం 11,176 బస్ సర్వీసులు నడపనున్నారు. ప్రయాణికుల సంఖ్య పెరిగితే ప్రైవేటు బస్సులను కూడా అద్దెకు తీసుకొని నడుపుతామని రాష్ట్ర రవాణా శాఖ ప్రకటించింది. దక్షిణ రైల్వే ఆధ్వర్యంలో మదురై, నాగర్‌కోయిల్, కన్నియాకుమారి, సెంగోట్టై, కోవై తదితర మార్గాల్లో ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు ప్రకటించారు. రాష్ట్రంలో ప్రతిరోజు నడిపే 2,500 బస్సులతో పాటు అదనంగా 1,000 బస్సులు నడుపుతామని ఆమ్నీ బస్సుల యజమానుల సంఘం తెలిపింది. ఇవికాక, కార్లు, సొంత వాహనాల్లో వెళ్లేందుకు ప్రజలు సమాయత్త మవుతున్నారు. రాజధాని నగరం నుంచే సుమారు 10 లక్షల మంది సొంతూళ్లకు వెళ్లనున్నారని రవాణా శాఖ అంచనా వేస్తోంది. ఈ విషయమై రవాణాశాఖ అధికారులు మాట్లాడుతూ... దీపావళి పండుగ సందర్భంగా ప్రత్యేక బస్సులు నడపనున్నామన్నారు. ప్రయాణికుల రద్దీని నియంత్రించేలా కోయంబేడు, కిలాంబాక్కం, మాధవరం బస్ టెర్మినళ్ల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని తెలిపారు. ప్రభుత్వ ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణించేందుకు 1.08 లక్షల మంది రిజర్వేషన్ చేసుకున్నా౦న్నారు.



గత ఏడాది దీపావళి సందర్భంగా చెన్నై నుంచి ప్రభుత్వ బస్సుల్లో సుమారు 5 లక్షల మంది ప్రయాణం చేయగా, ఈ ఏడాది 5.82 లక్షల మంది వెళ్లే అవకాశముందని భావిస్తున్నామన్నారు. దక్షిణ రైల్వే అధికారులు మాట్లాడుతూ... నగరం నుంచి యథావిధిగా వెళ్లే రైళ్లతో పాటు 40 ప్రత్యేక రైళ్లు నడుపుతున్నామన్నారు. రాజధాని నగరం నుంచి రైళ్ల ద్వారా 3 లక్షల మంది ప్రయాణించే అవకాశముందన్నారు. నగరం నుంచి సొంతూళ్లకు వెళ్లే వారు అధికంగా 28, 29 తేదీల్లో ప్రయాణించ నున్నారు. అందరూ ఒకే సమయంలో వెళ్లకుండా, ఉదయం నుంచి ప్రయాణం చేస్తే రద్దీ తగ్గడంతో పాటు శ్రమ పడాల్సిన అవసరం లేదని అధికారులు సూచించారు. దీపావళి పండుగ సందర్భంగా ఆమ్నీ బస్సు ఛార్జీలు మూడు రెట్లు పెరగడంతో ప్రయాణికులు దిగ్భ్రాంతి చెందుతున్నారు. ఛార్జీలు పెంచే ఆమ్నీ బస్సులను స్వాధీనం చేసుకోవడంతో పాటు వాటి పర్మిట్లు రద్దు చేస్తామని రవాణా శాఖ అధికారులు హెచ్చరిస్తున్నా, ఆమ్నీ బస్సుల యజమానులు వాటిని లక్ష్యపెట్టకుండా ఛార్జీలు భారీగా పెంచుకుంటూ పోతున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

# పొంగులేటి వ్యాఖ్యల్లో నిజమెంత..?



హైదరాబాద్,ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర మంత్రుల బృందం సౌత్ కొరియా పర్యటనలో ఉంది. అక్కడి రాజధాని సియోల్‌లో హన్ నది పునరుజ్జీవ ప్రాజెక్టును మంత్రులు, అధికారుల బృందం విజిట్ చేసింది. ప్రాజెక్టును సక్సెస్ ఫుల్‌గా తీర్చిదిద్దడంపై స్టడీ చేస్తున్నారు. అదే తరహాలో మూసీని ప్రక్షాళన చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంతో మంత్రులు అక్కడికి చేరుకున్నారు.నాలుగు రోజులుగా వీరంతా సియోల్ నగరంలో పర్యటిస్తున్నారు. అక్కడి హన్ నది పరిస్థితులను ఎప్పటికప్పుడు వివరిస్తున్నారు. ఇదే క్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అక్కడి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. మరికొద్ది రోజుల్లోనే పెద్ద బాంబ్‌లు పేలబోతున్నాయని బాంబ్ పేల్చారు. అయితే.. పొంగులేటి చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర వ్యాప్తంగా సంచలన చర్చకు దారితీసింది. రాష్ట్రంలో ఏం జరగబోతోంది..? రాజకీయంగా ఎలాంటి మార్పులు రాబోతున్నాయి..? రాజకీయంగా ఎవరు బలి కాబోతున్నారు..? అనేది ఆసక్తికర చర్చ నడుస్తోంది.తమ పర్యటన ముగిసి హైదరాబాద్ చేరుకున్న తరువాత అయినా.. లేక అంతకుముందే అయినా తెలంగాణలో ఒకటి లేదా రెండు పొలిటికల్ బాంబులు పేలబోతున్నాయని మంత్రి పొంగులేటి వ్యాఖ్యలు చేశారు. అయితే అది ఫోన్ ట్యాపింగ్ కావచ్చు.. ధరణి కావచ్చు.. కాళేశ్వరం కావచ్చు.. ఇలా 8 నుంచి 10 అంశాలు ఉన్నాయని చెప్పుకొచ్చారు. అయితే.. వీటిలో ప్రధాన నాయకులే ఉంటారని తెలిపారు. తొందర పడి నిర్ణయాలు తీసుకోకుండా అన్ని ఆధారాలతో సహా వాటిని ప్రజల ముందు పెట్టబోతున్నట్లు స్పష్టం చేశారు. దానికి సంబంధించిన ఫైళ్లు కూడా సిద్ధం అయ్యాయని చెప్పారు. కక్ష సాధింపు చర్యల్లా కాకుండా.. సాక్ష్యాధారాలతో సహా సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన విచారణ ఇప్పటికే పూర్తయినట్లు మంత్రి తెలిపారు. ఫోన్ ట్యాపింగ్, ధరణి వంటి అంశాలు కూడా ట్రాక్‌లోనే ఉన్నాయన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలపై ఇంతవరకు తమ ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని, ప్రజలు కోరుకునే విధంగా చర్యలు ఉంటాయని తెలిపారు. పూర్తి ఆధారాలతో ఫైళ్లు కదిలాయని, రెండు రోజుల్లోనే చర్యలకు సంబంధించి ప్రజలు కీలక వార్తలు వినబోతున్నారని తెలిపారు. దీంతో శ్రీనివాసరెడ్డి చేసిన వ్యాఖ్యలు ఎవరిని ఉద్దేశించినవి అని రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ కొనసాగుతోంది.రాష్ట్రంలో గత పదేళ్లు బీఆర్ఎస్ ప్రభుత్వం కొనసాగింది. పది నెలల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరింది. దీంతో గత ప్రభుత్వ ఘనకార్యాలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా వెలుగులోకి తీసుకొస్తోంది.

# తెలంగాణలో డ్రగ్స్ నియంత్రణకు కీలకమైన నిర్ణయం

హైదరాబాద్,తెలంగాణలో డ్రగ్స్ నియంత్రణకు ప్రభుత్వం మరో కీలకమైన నిర్ణయం తీసుకుంది. డ్రగ్స్ నియంత్రణకు సోల్జర్స్‌ను, నియంత్రణ కమిటీలను ఏర్పాటు చేయబోతోంది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేయనుంది. ఇప్పటి వరకు డ్రగ్స్ వాడకం నగరాలకు, పట్టణాలకు మాత్రమే పరిమితం అయ్యేది. ఇప్పుడు గ్రామస్థాయికి చేరుకుంది. కొన్ని ప్రాంతాల్లో స్కూల్‌కు సమీపంలో ఉన్న దుకాణాల్లో కూడా డ్రగ్స్ పెడ్లర్లు అమ్మకాలు మొదలు పెట్టారు. ఇలా రోజుకో రూపంలో గంజాయి లాంటి మత్తు పదార్థాలను విక్రయించే ముఠాలను అరికట్టడం పోలీసులకు ప్రభుత్వానికి సవాల్‌గా మారింది. ఒకట్రెండు డిపార్టమెంట్లతో దీన్ని నిర్మూలించడంలో సమస్యలు ఎదురవుతున్నాయి. సమాచారం ఇవ్వాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నా చైతన్యం అవుతున్న వాళ్లు తక్కువమందే ఉంటున్నారు. ప్రజల సహకారంతో ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఓవైపు పెడ్లర్లపై ఉక్కుపాదం మోపుతూనే వినియోగ దారులను అరికట్టే ప్రయత్నాల్లో ప్రభుత్వం సరికొత్త విధానం తీసుకొస్తోంది. ప్రభుత్వ టీచర్లు, ప్రిన్సిపల్, రెవెన్యూ అధికారులను ఇందులో భాగస్వాములను చేయనుంది. వీరితోపాటు వైద్యులు, పారామెడికల్ స్టాఫ్, ఆశా వర్కర్లు, అంగన్వాడీలతో కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. వీళ్లకు డ్రగ్స్ కంట్రోల్‌లో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. గ్రామస్థాయిలో పోలీస్ సర్వేలెన్స్‌కు దూరంగా మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్న, వినియోగిస్తున్న వారి వివరాలు సేకరించనున్నారు. వారికి కౌన్సిలింగ్ ఇవ్వడం, వాటికి దూరంగా ఉండేలా చేయనున్నారు. ఇలా దశల వారీగా వివిధ ప్రణాళికలు అమలు చేసి డ్రగ్స్‌రహిత రాష్ట్రంగా తీర్చి దిద్దాలని చూస్తున్నారు. ఇప్పటికే తెలంగాణలో డ్రగ్స్‌పై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. పబ్బులు, ఇతర ప్రైవేటు పార్టీలపై దాడులు చేస్తోంది. అమ్మేవారిపై నిఘా పెట్టారు. కొంటున్న వారికి కౌన్సిలింగ్ ఇస్తున్నారు. విమానాశ్రయం, బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్లలో తనిఖీలు విస్తృతం చేశారు. అనుమానం ఉన్న వాహనాలను తనిఖీలు చేస్తున్నారు. ఇప్పుడు ప్రభుత్వం ఉద్యోగులందరితోపాటు ప్రజలను



కూడా భాగస్వాములను చేయాలని ప్రభుత్వం చూస్తోంది.

## సరిహద్దు రాష్ట్రాల నుంచి మహారాష్ట్రకు డబ్బులు

హైదరాబాద్, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సరిహద్దు రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటక సరిహద్దులను మూసేయాలని, భద్రతను కట్టుదిట్టం చేయాలని శివసేన నాయకుడు కిరణ్ పావస్కర్ డిమాండ్ చేశారు. ఈ అంశంపై కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు. ఎందుకంటే కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటక నుంచి మహారాష్ట్రకు వందల కోట్ల నగదును తరలించే అవకాశం ఉందని కిరణ్ పేర్కొన్నారు. ఈ నగదును మహా వికాస్ అఘాడీకి ఖర్చు పెట్టే అవకాశం ఉందని తెలిపారు. కిరణ్ లేవనెత్తిన అంశం జాతీయ మీడియాలో ప్రచురితం అయింది. ఈ వార్తలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఈ అంశంపై కేటీఆర్ కూడా ఎక్స్ వేదికగా స్పందించారు. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ఏటీఎంగా మారిందని ధ్వజమెత్తారు. ఆర్ఆర్ ట్యాక్స్ నుంచి హర్యానా, మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాల ఎన్నికలకు నిధులు సమకూర్చుతున్నారని కేటీఆర్ ఆరోపించారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com